

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

కరీంనగర్

epaper.vaartha.com WWW.VAARTHA.COM fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-11-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 280 పేజీలు: 8+16 వెల: 6.50

తగ్గిన కేన్సర్ మందుల ధరలు 5

5 రాష్ట్రాల ఎన్నికలకు ఇసి కసరత్తు



బియ్యం రేట్లు పెంచితే కొరడా

గరిష్ట ధరలు ప్రకటించిన ప్రభుత్వం

బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు

కిలో బియ్యం గరిష్ట ధరలు
బిపిటి, కెఎన్ఎం రకాలు: రూ.66
ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాలు: రూ.74
హెచ్ఎంటి, జెఎస్ఆర్ రకాలు: రూ.79

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు9: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నిత్య వసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. బియ్యం ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కనిష్ఠంగా కిలో బియ్యం ధర రూ.66గా.. గరిష్ఠంగా రూ.79గా నిర్ణయించింది. హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాల బియ్యం కిలో గరిష్ఠ ధర రూ.79గా నిర్ణయించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే చర్యలు తీసుకుంటామని బియ్యం వ్యాపారులు, రైస్ మిల్లు యజమానులను >>2



పోలేపల్లి ఎల్లమ్మ సాక్షిగా చెబుతున్నా..

కొడంగల్ పంటలకు కృష్ణా జలాలు

కరవుపై కొందరు గంజాయి మత్తులో మాట్లాడుతున్నారు..

కెటిఆర్! పులినిచూసి వాత పెట్టుకోవద్దు

లగచర్ల రైతు సభలో సిఎం రేవంత్‌రెడ్డి

యేడాదిలో 'పాలమూరు'

అడ్డొచ్చినవారిని తొక్కుతా: ముఖ్యమంత్రి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి / దుద్యాల, నవంబరు 9, ప్రభాతవార్త : పోలేపల్లి యెల్లమ్మ మాత సాక్షిగా యేడాదిలోగా పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మఖ్తల్ నుంచి కొడంగల్ వరకు భూములను కృష్ణా జలాలతో తడిపేస్తానని, ఎవరు అడ్డొచ్చినా తొక్కి పారేస్తామని హెచ్చరించారు. సోమవారం >>2

కీలక అభివృద్ధి కేంద్రంగా కొడంగల్ 6

లగచర్ల రైతు సభలో డి. సిఎం భట్టి విక్రమార్క

70 లక్షల ఓట్లకు కత్తెర!

తుది దశకు చేరుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

ఇప్పటి వరకు 2,61,74,795 ఓట్ల ఆమోదం

30న ఓటర్ల తుది జాబితా వెల్లడి



హైదరాబాద్,నవంబరు9,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 91.10 లక్షల మంది నోటీసులకు స్పందించి డాక్యుమెంట్లు సమర్పించి ఓటును కాపాడుకున్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. సుమారు మరో 25వేల నోటీసులపైనే విచారణ పెండింగులో ఉంది. ఇప్పటి వరకు 2,61,74,795 ఓట్ల తుది జాబితాకు ఆమోదం లభించింది. సుమారు 70లక్షల ఓట్లు తగ్గే అవకాశం కనిపిస్తోంది. ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులుంటే ఇప్పటికైనా దరఖాస్తు చేసుకొనేందుకు కేంద్ర ఎన్నికలకమిషన్ అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య సుమారు 2.70 కోట్ల వరకు తేలే అవకాశం కనిపిస్తోంది. ఓటరు జాబితా సమగ్రసవరణ ప్రక్రియ దాదాపు చివరిదశకు చేరింది.గత షెడ్యూలు ప్రకారం సోమవారం తుది జాబితా ప్రకటించాల్సి ఉండగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఈనెల 30 వరకు పొడిగించింది. ఎస్ఐఆర్ ప్రారంభం >>2

చలి పంజా

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: తెలంగాణలో చలి తీవ్రత పెరిగింది. ఇటీవల వర్షపాతం తగ్గడంతో వాతావరణం పొడిగా మారింది. రాత్రి, ఉదయం సమయంలో చల్లని గాలులు బలంగా వీస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం వేళల్లో చలిని చూసి ప్రజలు బయటకు రావడానికి >>2



సర్కారీ ఉద్యోగులకు 'సుప్రీం' షాక్

కస్టడీ 48 గంటలు దాటితే ఆటోమేటిక్ సస్పెన్షన్

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: ఏదైనా క్రిమినల్ కేసులో ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు పైగా పోలీసు లేక జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే ఆటోమేటిక్‌గా సస్పెండ్ అయినట్లేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జే.బీ.పార్దివాలా, జస్టిస్ మన్మోహన్ లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ సంచలన తీర్పునిచ్చింది. బీహార్‌లోని సమస్తీపూర్ సదర్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ విశ్వజీత్ సింగ్ 4 వేల రూపాయల లంచం తీసుకుంటూ అవినీతి >>2



భాగ్యలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు



దీపావళి సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన గవర్నర్ శుక్లా దంపతులు

ప్రత్యేక పూజలు నిర్వహించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

కిక్కిరిసిన చార్మినార్ పరిసర ప్రాంతాలు

హైదరాబాద్ (చార్మినార్), నవంబరు 9 ప్రభాతవార్త: దీపావళి సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో వేలాది మంది భక్తులు శ్రీ భాగ్యలక్ష్మి అమ్మ వారి దర్శనం కోసం రావటంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో జరుగుతున్న దీపావళి మహోత్సవాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ చార్మినార్, హుస్సేనీఆలం, మీర్‌చౌక్, మొగల్‌పుర పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కుటుంబ సభ్యులు చార్మినార్ శ్రీ భా గ్యలక్ష్మీ మందిరంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దీపావళి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.

రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ప్రముఖులు చార్మినార్ శ్రీ భాగ్య మందిరంలో పూజలు జరిపారు. అలియాబాద్, శాలిబండ, గుల్జారాహౌస్. చార్‌కమాన్, పురానాపూల్, దూద్‌బౌలి, ఛత్రినాక, గౌలిపుర, మీరాలంమండి, లాల్‌దర్వాజ, చాంద్రాయణగుట్ట, జియాగూడ, బేగంబజర్, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి, హిమాయత్‌నగర్‌తో పాటు జంట నగరాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు సోమ వారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. గుల్జారాహౌస్ సమీపంలోని మిట్టికాషేర్ రహదారి వరకు భక్తులు సోమవారం రాత్రి ఏడు గంటలకు నిలబడి ఉన్నారు. దీపావళి సందర్భంగా అమ్మ వారి ఖజానా భక్తులకు పంపిణీ చేయటంతో వేలాది మంది భక్తులు అమ్మ వారి ఖజానా కోసం తరలి వచ్చారు.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగ కుండ ప్రభుత్వ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చార్మినార్, లాడ్‌బజార్, గుల్జారాహౌస్, బల్దియా రహదారి, మిట్టికాషేర్ రోడ్డు రహదారులలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్నారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారంరాత్రి వరకు వేలాది మంది భక్తులు చార్మినార్ భ్యాగలక్ష్మీ మందిరంలో అమ్మ వారికి పూజలు నిర్వహించారు. చార్మినార్‌కు వచ్చే వాహనాలను మదీనావద్ద నిలిపి వేశారు.



భాగ్యలక్ష్మి అమ్మవారి నామెంకోసం పోటెత్తిన భక్తజనం

బియ్యం రేట్లు పెంచితే కొరడా

>> హెచ్చరించింది. బీపిటి,కెఎన్ఎం రకాల కిలో గరిష్ట ధర రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాల కిలో గరిష్ట ధర రూ.74, హెచ్ఎంటి,జెఎస్ఆర్ రకాల కిలో గరిష్ట ధర రూ.79గా నిర్ణయించినట్లు వెల్లడించింది. ఇదే సమయంలో బియ్యం కొరత ఉందంటూ సోషల్ మీడియా,ఇతర మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని పౌర సరఫరాల శాఖ ఖండించింది. రాష్ట్రంలో సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని,కొరత అంటూ వస్తున్న వార్తలన్నీ తప్పుడు ప్రచారమేనని స్పష్టం చేసింది. కృతిమ కొరతను సృష్టించి,అధిక ధరలకు బియ్యాన్ని విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్న వ్యాపారులను కట్టడి చేసేందుకు పౌరసరఫరాల శాఖ బియ్యం రకాలను బట్టి గరిష్ట విక్రయ ధరలను(ఎంఆర్పి) నిర్ణయిస్తూ కీలక ప్రకటన విడుదల చేసింది.

బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు: చీఫ్ రేషనింగ్ ఆఫీసర్

రాష్ట్రంలో బియ్యం కొరతపై వస్తున్న వార్తలు అవాస్తవమని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. బియ్యం బస్తాపై ఎమ్మార్పీ (లీళిశి) దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించే దళారులపై నిఘా ఉంచామని అన్నారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎవరైనా గరిష్ట పరిమితికి మించి అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే,అటువంటి వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. వ్యాపారులు నియమ నిబంధనలకు కట్టుబడి విక్రయాలు జరపాలని సూచించారు.

మార్కెట్‌లో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లుగా గమనిస్తే వెంటనే ఆ సమాచారాన్ని పౌరసరఫరాల శాఖకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెటింగ్,అక్రమ నిల్వలపై నిరంతరం నిఘా ఉంటుందని వెల్లడించారు.

70 లక్షల ఓట్లకు కత్తెర!

>> కాకముందు జాబితా ప్రకారం రాష్ట్రంలో 3,38,26,448 ఓటర్లు ఉన్నారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు జరిపిన ఎన్యుమరేషన్ ప్రక్రియలో 2,64,73,616 మంది మాత్రమే స్పందించారు. ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వని వారి పేర్లను తొలగించి ముసాయిదా ఓటర్ల జాబితాను ఆగస్టు 17న ఎన్నికల కమిషన్ ప్రకటించింది. రాష్ట్రంలో ఎన్యుమరేషన్ దశలోనే 73,39,235 ఓట్లు తగ్గిపోయాయి. అందులో మరణించిన వారి సంఖ్య 9,22,229. ఇళ్లు షిఫ్ట్ అయిన వారు 45,18,963 మంది ఉన్నారని, మరో 11,25,546 మంది అసలు అందుబాటులోనే లేరని, 6,70,203 మంది మరో చోట ఓటు నమోదు చేసుకున్నారని సీఈవో కార్యాలయం ప్రకటించింది. వారు కాకుండా 2002 జాబితాతో మ్యాపింగ్ కాని వారితో పాటు వివరాల్లో తేడా ఉన్న 92,88,181 ఓటర్లకు నోటీసులు ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా 32,36,659 ఓటర్ల పేర్లు 2002లో ఎస్ఐఆర్‌లో లేవని, మరో 60,50,918 ఓటర్లను అనామలిస్ కేటగిరిలో ప్రకటించారు. నోటీసుల జాబితాలో ఉన్న వారు కాకుండా మిగిలిన 1,70,65,846 ఓటర్లే పూర్తి సేఫ్ జోన్‌లో ఉన్నారు. ఆ తర్వాత అభ్యంతరాల సమయంలో 4,88,417 మంది మళ్లీ ఓటు కోసం ఫారం 6 సమర్పించారు. నోటీసులు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ దాదాపు ముగింపు దశకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 91.10 లక్షల మంది డాక్యుమెంట్లు సమర్పించి ఓటు కాపాడుకున్నారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలోనే సుమారు 40 లక్షల మంది ఓటును పదిలపరచుకున్నారు. నోటీసుల జాబితాలోని సుమారు 54 వేల ఓటర్లను అనర్హులుగా గుర్తించి తొలగించాలని నిర్ణయించారు. వారిలో ఎక్కువగా మరో చోట ఓటు ఉన్న వారేనని అధికారులు తెలిపారు.

జాబితా ప్రకటించినా దరఖాస్తుకు అవకాశం

అయితే, అర్హులు ఇప్పటికైనా దరఖాస్తు చేసుకొనేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ మరో అవకాశం ఇచ్చింది.

ఈనెల 26 వరకు నోటీసులు, అభ్యంతరాలు, కొత్త దరఖాస్తుల క్లియర్‌కు గడువు ఉంది. ఈనెల 30న తుది జాబితా ప్రకటించనున్నారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా అర్హులైన ఓటర్లు తమ పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని సీఈవో కార్యాలయం తెలిపింది.

కాంగ్రెస్‌కు భారీ షాక్

విరాళాల్లో 75 శాతం క్షీణత!

రూ.130.69 కోట్లకే పరిమితమైన విరాళాలు

న్యూఢిల్లీ, నవంబరు 9: కాంగ్రెస్ పార్టీకి విరాళాల రూపంలో వచ్చే ఆదాయం భారీగా తగ్గిపోయింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత స్థాయిలో రూ.20 వేలకుపైగా వచ్చిన విరాళాలు మరింతగా పడిపోయినట్లు తేలింది. ఎన్నికల సంఘానికి పార్టీ సమర్పించిన నివేదికల విశ్లేషణ ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్‌కు వచ్చిన విరాళాలు దాదాపు 75 శాతం తగ్గాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేలకుపైగా విరాళాల రూపంలో కాంగ్రెస్‌కు రూ.517.39 కోట్లు వచ్చాయి. అయితే 2025-26లో ఈ మొత్తం కేవలం రూ.130.69 కోట్లకు పడిపోయింది. 2015-16లో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే తరహా భారీ పతనాన్ని చవిచూసింది. అప్పట్లో పార్టీ విరాళాలు రూ.141.46 కోట్లకు తగ్గాయి. 2014-15తో పోలిస్తే విరాళాలు దాదాపు 86 శాతం పడిపోయినట్లు కాంగ్రెస్ వెల్లడించింది. అయితే కేంద్రంలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత కొన్ని సంవత్సరాల్లో పార్టీకి విరాళాలు గణనీయంగా పెరిగాయి. 2023-24లో రూ.281.48 కోట్ల విరాళాలు అందుకోగా, 2024-25లో ఈ మొత్తం రూ.517.39 కోట్లకు చేరింది. కాంగ్రెస్‌తో పోలిస్తే భారతీయ జనతా పార్టీకి భారీగా విరాళాలు అందుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేలకుపైగా విరాళాల రూపంలో బీజేపీకి ఏకంగా రూ.6,074.02 కోట్లు వచ్చాయి. ఇది కాంగ్రెస్‌కు వచ్చిన విరాళాల కంటే దాదాపు 12 రెట్లు ఎక్కువ. గత 12 ఆర్థిక సంవత్సరాల్లోనూ ప్రతి ఏడాది కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ విరాళాలు అందినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. కాంగ్రెస్‌కు విరాళాలు తగ్గడానికి ప్రధాన కారణాల్లో ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి వచ్చిన నిధులు తగ్గడం కూడా ఒకటి. 2024-25లో ఈ ట్రస్ట్ కాంగ్రెస్‌కు రూ.216.34 కోట్లు విరాళంగా ఇవ్వగా, 2025-26లో కేవలం రూ.25 కోట్లే ఇచ్చింది. అంటే దాదాపు 88 శాతం తగ్గుదల నమోదైంది. ఇతరత్రా స్టార్ సిమెంట్ రూ.5 కోట్లు, సజ్జన్ భజంకా రూ.4 కోట్లు, ప్రేమ్ కుమార్ భజంకా రూ.2 కోట్లు విరాళంగా అందించారు. 2025-26లో కాంగ్రెస్‌కు వచ్చిన రూ.130.69 కోట్ల విరాళాలు ఇటీవలి సంవత్సరాల్లో అత్యల్పం మాత్రం కాదు. అంతకుముందు కూడా కొన్ని సంవత్సరాల్లో ఇంతకంటే తక్కువ విరాళాలు వచ్చాయి. ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన మొత్తాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే, 2020-21 తర్వాత 2025-26లో కాంగ్రెస్‌కు వచ్చిన విరాళాలే అత్యల్పంగా నిలిచాయి. ఎన్నికల సంఘానికి సమర్పించిన విరాళాల నివేదికలో పార్టీ మొత్తం ఆదాయం వివరాలు ఉండవు. 2024-25లో కేవలం కూపన్ల విక్రయాల ద్వారానే కాంగ్రెస్‌కు రూ.350.12 కోట్ల ఆదాయం వచ్చినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

సర్కారీ ఉద్యోగులకు 'సుప్రీం' షాక్

>> నిరోధక చట్టం కింద అరెస్ట్ అయ్యారు. అరెస్ట్ తర్వాత ఆయన దాదాపు 15 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. దాంతో ఆయన ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యాడు. కస్టడీ తర్వాత సదరు ఉద్యోగి సస్పెన్షన్‌ను రద్దు చేసి తిరిగి అదే ఆస్పత్రిలో, అదే పోస్టులో నియమించడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని వెంటనే పరిశీలించాలని బీహార్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కాగా కేంద్ర ప్రభుత్వ సివిల్ సర్వీసెస్ రూల్ 10(2)(ఏ) ప్రకారం డీమ్డ్ సస్పెన్షన్ నిబంధన ఇప్పటికే అమల్లో ఉంది. అయితే, చాలా చోట్ల అధికారులు దీనిని నిరక్ష్యం చేస్తున్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకునేందుకు కీలకంగా మారనుంది.

వారం - వర్జ్యం

10-11-2026, మంగళవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, విశాఖ కార్తె,

తి.పాడ్యమి మ.2.02
న. విశాఖ ఉ.9.20
వ. మ.1.43 - మ.3.29
దు1. ఉ.8.25 - ఉ.9.11
దు2. రా.10.08 - రా.10.54
రాహు.మ.3.00-4.30, శుభ స. లేదు.

వార్తాఫలం

మేషం : కఠినమైన నిర్ణయాలను తీసుకుంటారు. జీవిత భాగస్వామితో విభేదాలు చోటు చేసుకుంటాయి.

వృషభం : ఏమి జరిగినా మంచికే జరిగిందనే వేదాంత తత్వాన్ని కనబరుస్తారు. దీర్ఘకాలిక సమస్యలు కొంతవరకు తీరుతాయి.

మిథునం : భాగస్వామి వ్యాపారాలు మినహా ఇతరుల వ్యాపారస్తులకు ఊరట కలిగించే పరిణామాలు చోటు చేసుకుంటాయి.

కర్కాటకం : విందు, వినోదాల ద్వారా కొత్త పరిచయాలు ఏర్పడతాయి. పాతవి ఉపకరిస్తాయి. వస్తు లాభం.

సింహం : వైరి వర్గంతో అప్రమత్తంగా మెలగండి. ఋణాల మీద వడ్డీలు తగ్గించుకోవ డానికి చేసే యత్నాలు కలిసివస్తాయి.

కన్య : మొండికి పడిన పనులలో కదలిక ఏర్పడుతుంది. ఆదాయాన్ని మించిన ఖర్చులు వున్నా నేర్పుగా సర్దుబాటు చేసుకుంటారు.

తుల : ఇతరులకు మీవంతు సహాయ సహకా రాలను సంపూర్ణంగా అందిస్తారు. సనాతన సాంప్రదాయాలపైన మక్కువ చూపుతారు.

వృశ్చికం : సంతాన యోగక్షేమాలపట్ల అధిక శ్రద్ధను చూపుతారు. మీ ఆలోచనలకు కార్య రూపాన్ని ఇస్తారు.

ధనుస్సు : నూతన వ్యాపారాలు ప్రారంభించ డానికి గాను కావలసిన వనరుల సమీకరణకు ఎక్కువగా ప్రాముఖ్యతనిస్తారు.

మకరం : కీలకమైన విలువైన పత్రాల భద్రతా విషయాలలో జాగ్రత్తలు వహించండి. సులువుగా పనులు పూర్తి అవుతాయి.

కుంభం : రుణాలు చాలావరకు తీరుస్తారు. ఇకపై రుణాలు చేయకూడదని నిర్ణయం తీసుకుంటారు.

మీనం : బంధువులు కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆస్తి వివాదాలు తీరుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

ఆడబిడ్డలారా నిలబడండి.. పారిశ్రామికవేత్తలుగా మారండి

2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మహిళా స్వయం సహాయక బృందాలతో సిఎం రేవంత్ ముఖాముఖి

హైదరాబాద్,నవంబరు9,ప్రభాతవార్త: కొడంగల్‌లో పర్యటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం మహిళా స్వయం సహాయక బృందాల మధ్య నిరాం బరంగా పుట్టిన రోజు జరుపుకున్నారు. అదే రోజు దీపావళి పండుగ, ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక బృందాలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. దీపావళి పండుగ ఉన్నా,నాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని వచ్చిన అడపడుచులందరికీ ధన్యవాదాలు తెలిపారు. 'మీరే నా కుటుంబం, నా ఆత్మబంధువులు. మా అడపడుచుల ఆశీర్వాదంతోనే ఇంత ఉన్నత స్థాయికి ఎదిగా, అడిగినదానికంటే ఎక్కువ మీరు నాకు అందించారు' అని పేర్కొన్నారు. కోటి మంది అడబిడ్డలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళతానని మాట ఇస్తున్నా, 70లక్షల మంది అడబిడ్డలు స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా చేరారు, 2034 నాటికి కోటీ మంది సభ్యులు కావాలి,. కోటీ మందిని కోటీశ్వరులను చేయాలనేది మా లక్ష్యం' అని పేర్కొన్నారు. ఏమీ ఆశించకుండా ఇంటిల్లిపాది అవసరాన్ని చూసుకునేది ఆడబిడ్డనే, ఆడబిడ్డ చేతిలో పెత్తనం ఉంటేనే ఇల్లు బాగుపడుతుంది' అని అన్నారు. ప్రతి ఏటా రూ.15 నుంచి రూ.20 కోట్ల వ్యాపారాన్ని మహిళలు చేసుకోగలుగుతున్నారు. పెట్రోల్ బంకులు,సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వాములను చేశాం, సచివాలయంలో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇందిరమ్మ క్యాంటీన్‌ల నిర్వహణ అడబిడ్డలకే అప్పగించాం' అని చెప్పారు. 34 నెలలో మహిళలకు రూ.79వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించా. ఈసందర్భంగా మంత్రి సీతక్కను అభినందిస్తున్నట్లు తెలిపారు. దీపావళి పండుగ రోజు 4.5 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తే అందులో ఒంటరి మహిళలు,వితంతు మహిళలకు 3.5 లక్షల పెన్షన్లు మంజూరు చేశాం, నేత,గీత కార్మికులకు కొత్త పెన్షన్లు సాచ్యురేషన్ మోడ్‌లో మంజూరు చేశాం' అని చెప్పారు. మీ ధైర్యం ఇందిరమ్మ ఇండ్లు,మీ ధైర్యం 200 యూనిట్ల ఉచిత కరెంట్, ప్రతి రోజు 37లక్షల మంది అడబిడ్డలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఆడబిడ్డల కోసం ఆర్టీసికి నగదు చెల్లించి లాభాల బాటలోకి తీసుకొచ్చాం అని చెప్పారు. ఏ ముఖ్యమంత్రి అయినా సన్న బియ్యం ఇవ్వాలన్న ఆలోచన చేశారా? మీ సంతోషమే నా సంతోషం, మీ కోసమే నేను కష్టపడుతున్నా' అని పేర్కొన్నారు. మా అడబిడ్డల ఆశీర్వాదమే నాకు శక్తి అందుకే మీ మధ్య నా పుట్టిన రోజు జరుపుకోవాలని వచ్చా' అని చెప్పారు. మహిళలు వ్యాపారవేత్తలు కావాలి. పారిశ్రామికవేత్తలు కావాలి, నేను ముఖ్యమంత్రిగా ఉండగానే కోటి మంది ఆడబిడ్డలు కోటీశ్వరులను చేస్తే నా జన్మ ధన్యం అవుతుందన్నారు. ఆడబిడ్డలకు సారెగా చీర పెట్టా, సొంత చెల్లిలిని ఇంటి నుంచి బయటకు గెంటేసిన దుర్మార్గుడు కెటిఆర్, ఆయన మహిళలను ఉద్ధరిస్తానని మాట్లాడుతున్నాడు, సొంత చెల్లెలే ఆయన ఘనకార్యం గురించి చెబుతుంది. పదేళ్ల అధికారం ఇస్తే ఏం చేశారో ఏమిచ్చారో అడగండీ' అని విమర్శించారు. 'మీ అన్నగా మీ తమ్ముడిగా సేవలందించే అవకాశం దేవుడు ఇచ్చాడు.ఆడబిడ్డలారా నిలబడండి,నిలదొక్కుకోండి. పారిశ్రామికవేత్తలుగా మారండి,బిడ్డలను చదివించుకోండి, చదువే మీ జీవితాలను మారుస్తుంది. మీరు పడిన కష్టాలు మీ పిల్లలు పడొద్దు, మీ బిడ్డల చదువులపై మీకు ఎంత శ్రద్ద ఉందో నాకు కూడా అంతే శ్రద్ద ఉంది. మీ అడబిడ్డల్ని ఉన్నత చదవులు చదివిస్తానని నా పుట్టిన రోజునే నాకు మాట ఇవ్వండి,. ఈ ప్రభుత్వం అండగా నిలబడుతుంది. మా ఆడబిడ్డలకు ఈ జన్మదినాన్ని అంకితం చేస్తున్నా' అని ప్రకటించారు.

చలి పంజా

>> సంకోచిస్తున్నారు. తెలంగాణలో ఉత్తర జిల్లాలు మరింత తీవ్రమైన చలితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 14 నుండి 16 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. వివిధ జిల్లాల్లో మంచు పడుతూ తెల్లవారు సమయంలో రోడ్లు సైతం కనించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. గడచిన 24 గంటల్ల రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో 14.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కామారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట్, జనగామ జినల్లాల్లో 14.8 డిగ్రీలు, నిజామాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 14.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణ శాఖ తెలిపిన ప్రకారం, రాత్రి ఉష్ణోగ్రతలు రాబోయే రోజుల్లో మరింత తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు 17 నుండి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి.

13 జిల్లాల్లో అసాధారణ కరవు

6 జిల్లాల పరిస్థితి ఆందోళనకరం..

రబీ నీటి లభ్యతపై దిక్కుతోచని రైతులు

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: తెలంగాణలో తీవ్ర వర్షాభావంతో వివిధ ప్రాంతాల్లో అసాధారణ కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్రంలోని 13 జిల్లాలు ఈ అసాధారణమైన వ్యవసాయ కరువును ఎదుర్కొంటున్నాయి, ఇక్కడ నేలలో తేమ స్థాయిలు సాధారణం కంటే గణనీయంగా తక్కువగా పడిపోయాయి. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో నేలలోని తేమ శాతం దారణంగా పడిపోవడంతో సాగుకు నీటి లభ్యతకు పెను ముప్పు ఏర్పడబోతోందనే హెచ్చరికలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే భూగర్భ జలాలు, నీటిపారుదలపై ఆధారపడిన రైతులు ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు అందుబాటులో ఉన్న నీటిలో అధిక భాగం ఇప్పటికే వినియోగించిన నేపథ్యంలో రైతుల ముందున్న రబీ సీజన్‌కు వనరులు పరిమితంగా మిగిలి ఉంటాయి. మధ్య తెలంగాణలో కొంత మెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, ఈ లోటును పూడ్చడానికి ఇటీవల కురిసిన వర్షాలు సరిపోకపోవచ్చనేది అధ్యయన నివేదికలు వెల్లడిస్తున్నాయి. బొబాయి ఐఐటీ చేసిన తాజా పరిశోధన ఫలితాలు రైతులకు నీటి లభ్యతపై కొత్త ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఈ నెల 2 నుండి 8వ తేదీ వరకూ చేసిన ఈ పరిశోధన ఫలితాలను చూస్తే పలు జిల్లాల్లోని నేలలో తేమ స్థాయి పరిస్థితులు అసాధారణంగా మారాయి. తీంతో రబీ సీజనుకు రైతులు సిద్దమవుతున్న తరుణంలో నీటి లభ్యత పెద్ద మప్పును తెచ్చేవిగా ఉంది. రాష్ట్రంలోని గద్వాల్, నారాయణ్‌పేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేలలో ఉన్న తేమ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సమయంలో వాటి నేల తేమ అసాధారణ విలువలు 1.65 నుండి 2.88 మధ్య ఉన్నాయి. గద్వాల్ అత్యల్పంగా -2.883 లోటును నమోదు చేయగా, ఆ తర్వాత నారాయణ్‌పేటలో -2.820, నాగర్‌కర్నూల్ -2.532, వనపర్తిలో -2.527, మహబూబ్‌నగర్ జిల్లాలో -2.501 చొప్పున నేలో తేమ సాధారణం కంటే భారీగా తగ్గిపోయింది. అలాగే 13 జిల్లాలకు సంబంధించి నేలలో తేమ లోటు అత్యధికంగా తగ్గుదల చోటు చేసుకుంది. వికారాబాద్‌లో -2.446, సంగారెడ్డిలో -2.256గా నమోదైంది. కామారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, రంగారెడ్డి, మెదక్‌లలో వరుసగా -2.096, -2.029, -1.972, -1.896, -1.777, -1.650గా నేలలో తేమ సాధారణం కంటే తక్కువకు నమోదయ్యాయి. అడపాదపా అక్కడక్కడా కురుస్తున్న వర్షాలతో కొంత ఉపశమనం కలిగించినట్లు కన్పిస్తున్నా, నేలలో పేరుకుపోయిన తేమ లోటును పూడ్చడం కష్టమని ఐఐటి బొంబాయిలోని సెంటర్ ఆఫ్ స్టడీస్ ఇన్ రిసోర్సెస్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్, ఇంటర్ ఇసిప్లినరీ ప్రోగ్రామ్ ఇన్ క్లైమేట్ స్టడీస్ అసోసియేట్ ఫ్యాకల్టీ సభ్యులు కార్తికేయన్ పేర్కొన్నారు.



సోమవారం లగచర్ల రైతు సభలో సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, రాజనర్సింహ తదితరులు

యేడాదిలో 'పాలమూరు'

>> రాత్రి దుద్యాల మండలం లగచర్ల రైతు మహాసభకు పెద్ద ఎత్తున మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, ప్రజలతో ర్యాలీగా వచ్చారు. రూ.10 వేల కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం సభనుద్దేశించి సీఎం మాట్లాడారు. నిజాం పాలన నుంచి స్వాతంత్ర్యానంతరం 70 ఏండ్లుగా పాలకులు పాలమూరుకు ఒరగబెట్టిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలసలు, కల్తీ కల్లు మరణాల విషాధగాథలు మిగిల్చారని వ్యాఖ్యానించారు. బూర్గుల రామకృష్ణారావు నుంచి కేసీఆర్ వరకు మహబూబ్‌నగర్‌కు అభివృద్ధి ఫలాలు అందించలేదని విమర్శించారు. ఉద్యమ సమయంలో మఖ్తల్ ప్రాజెక్టు గురించి తనతో చర్చించిన కేసీఆర్ ఎంపీగా గెలిచిన తర్వాత ఊసెత్తలేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పాలమూరు ప్రజల గుండెలపై తన్ని గజ్వేల్‌కు వెళ్లిపోయారని మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబీకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి చిప్ప చేతికి ఇచ్చారని వ్యాఖ్యానించారు. 2023 డిసెంబరులో సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ దశ దిశ మార్చుతున్నానని రేవంత్ తెలిపారు. మంత్రులు, ఐఏఎస్ అధికారులతో చర్చించి ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు వేస్తున్నామని చెప్పారు. కాంట్రాక్టర్లకు, సర్పంచ్‌లకు చెల్లింపులు కూడా సకాలంలో చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ చేసిన అప్పులను యేటా 80 వేల కోట్ల రూపాయలను తీర్చుతున్నామని వెల్లడించారు. తప్పులు చేసి ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఇటీవల కేటీఆర్ గడ్డం పెంచుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ గడ్డం మోకాళ్ల వరకు పెంచినా, గండిపేటలో దూకినా తన విధానాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ విధానాలు, తమ పాలనను చూసి యువత, మహిళలు ఆదరించడం చూసి ఓర్వలేకపోతున్నారని సీఎం మండిపడ్డారు. నమ్మిన వాళ్లకి ప్రాణమైనా ఇచ్చే మనస్తత్వం తనదని రేవంత్‌రెడ్డి అన్నారు. పది జన్మలెత్తినా కేటీఆర్ తనలా కాలేరని వ్యాఖ్యానించారు. కరువుపైన ఇటీవల కొంతమంది గంజాయి మత్తులో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ అభివృద్ధికి దండిగా నిధులు ఇస్తామని, ఎవరైనా అడ్డుపడితే వారికి తగిన గుణప



యతీంద్ర సప్తతి కార్యక్రమంలో చినజీయర్‌స్వామి, విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తదితరులు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉత్తమ లక్ష్యాలతో న్యాయ కళాశాల

విద్యార్థుల కోసం చినజీయర్‌స్వామి ప్రత్యేక చొరవ

శంషాబాద్ నవంబరు 9, ప్రభాతవార్త : విద్యార్థులకు నాణ్యమైన న్యాయ విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రపంచంలోనే మొట్టమొదటి న్యాయ కళా శాలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు చినజీయర్ స్వామి ప్రకటించారు. శంషాబాద్ ముచ్చింతల్ స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో యతీంద్ర సప్తతి రెండోరోజు నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. భారతదేశంతోపాటు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ జీయర్ సంస్థలు తమ సేవలను చినజీయర్‌స్వామికి వివరించాయి. ఈ సందర్భంగా మాట్లాడిన స్వామీజీ, దళితులు, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు న్యాయ విద్యలోనూ అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జీయర్ ఎడ్యు కేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణి, జీయర్ ఇంటిగ్రేటెడ్ వైదిక్ అకాడమీ, స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ, దివ్య సాకేతం తదితర సంస్థలు తమ సేవలను వివరించాయి. విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాల్లో సేవలను మరింత విస్తరించేందుకు పలు సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు.

అమెరికాలో తెలుగు యువకుడి అనుమానాస్పద మృతి

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: తెలంగాణ మూలాలు ఉన్న ఓ యువకుడు అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఉన్నత చదువులు పూర్తి చేసుకుని, ఉద్యోగంలో స్థిరపడేందుకు సన్నాహాలు చేసుకుంటున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకోవడంతో ఆ కుటుంబంలో శోకం అలుముకుంది. వెల్మ రిషిరెడ్డి (21) అమెరికాలోని ఓహియోలో నివాసం ఉంటున్నాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన రిషిరెడ్డి కుటుంబం 25 సంవత్సరాల క్రితమే అమెరికా వెళ్లి స్థిరపడింది. ఇటీవల ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న రిషిరెడ్డి, ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాడు. మూడు రోజుల క్రితం ఓహాయోలోని తన హాస్టల్ గదిలో రిషిరెడ్డి అనుమానాస్పద రీతిలో విగతజీవిగా కనిపించాడు. గదిలో అచేతనంగా పడి ఉన్న అతడిని గమనించిన స్నేహితులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఎంతో ఉత్సాహంగా ఉన్న కుమారుడు ఉన్నట్టుండి ప్రాణాలు కోల్పోయాడన్న వార్త తెలిసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కాగా రిషిరెడ్డి మృతికి గల కచ్చితమైన కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతం పోస్ట్‌మార్టం ప్రక్రియ కొనసాగుతోందని, దీనికి సంబంధించిన నివేదిక వచ్చిన తరువాత మరణానికి గల కారణాలు తెలిసే అవకాశముందని కుటుంబ సభ్యులు తెలిపారు. రిషిరెడ్డి నాయనమ్మ ఇప్పటికీ తమ స్వగ్రామమైన రామన్నపేటలోనే నివసిస్తుండటంతో ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

హార్వెస్టర్ మిషన్లు లీజుకిస్తామని వ్యక్తి కిడ్నాప్

రూ.10 లక్షలు డిమాండ్, నలుగురు నిందితుల అరెస్టు

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: వరికోత పనులకు వాడే హార్వెస్టర్ యంత్రాలను తక్కువ ధరకు లీజుకు ఇస్తామని నమ్మించి ఓ వ్యక్తిని కిడ్నాప్ చేయడంతో పాటు అతని కుటుంబాన్ని పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసిన నలుగురు నిందితులను కామారెడ్డి జిల్లా దో మకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాల ను జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర సోమవారం మీడియాకు వెల్లడించారు. దోమకొండ పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన చిందం మహేష్ అ నే వ్యక్తి వరి కోతల హార్వెస్టర్ మిషన్లను లీజుకు తీసుకొని నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో కరుణాకర్ రెడ్డి అనే పే రుతో ఒక వ్యక్తి పరిచయం చేసుకొని అతని హార్వెస్టర్ మిషన్లు లీజుకు ఇస్తానని నమ్మించి గత నెల 22 తేదీన రాత్రి కారులో తన వెంట తీసు కు వెళ్లి కిడ్నాప్ చేశాడు. అనంతరం మార్గమధ్యలో మరో ఇద్దరితో కలిసి బాధితుడి ముఖానికి ఉన్ని టోపీని మాస్క్‌లు వేసి, దాడి చేసి, చంపే స్తామని బెదిరించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు పర్సులోని 2500 రూపాయల నగదును బలవంతంగా లాక్కున్నారు. అయితే దీని త రువాత కిడ్నాపర్లు మద్యం మత్తులో వుండగా బాధితుడు తప్పించుకున్నాడు. అనంతరం బాధితుడిని కిడ్నాపర్లు వెంటాడగా అతను వారికి దొర లలేదు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టగా నలుగురు నేరగాళ్లు ఈ కిడ్నాప్‌కు యత్నిం చినట్లు తేలింది. ఈ కేసులో నిందిలుగా వున్న నిట్టూ నర్సింగ్ రావు, ఎరుగు నగేష్, చిందం శ్రీకాంత్ గతంలో జైలులో ఉన్న సమయంలో ు పరిచయమై, జైలు నుంచి విడుదలైన అనంతరం సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చిందం మహేష్‌ను కిడ్నాప్ చేశారు. ఈ క్ర మంలో నకిలీ పేర్లు వాడారు. వీరికి బాధితుడి గ్రామానికి చెందిన చిందం శ్రీకాంత్ సహకరించాడు. నిందితులను ఆదివారం నాడు అరెస్టు చే యగా వారి వద్ద నుంచి బాధితుడి సెల్‌ఫోన్‌తో పాటు మరో నాలుగు సెల్‌ఫోన్లు, కిడ్నాప్‌కు వాడిన కారు ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. అ రెస్టయిన నేరగాళ్లపై ఇప్పటికే క్రిమినల్ కేసులున్నాయని ఎస్పి తెలిపారు. కిడ్నాపర్లను అరెస్టు పోలీసులను జిల్లా ఎస్పి అభినందించారు.

నక్సలిజం పోయినా దీమాగీ నక్సలిజం పెరిగింది

ఛత్తీస్‌గఢ్‌లో ప్రధాని మోడీ

బస్తర్, నవంబరు 9: దేశంలో సాయుధ నక్సలిజం పూర్తిగా అంత మైనప్పటికీ, దిమాగీ నక్సల్స్ నుంచి ముప్పు ఇంకా పొంచి ఉందని, దేశ భద్రత కోసం వారిని ఓడించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో భద్రతా దళాలను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, గత 12 ఏళ్ల కాలంలో భారత్ నక్సలిజం, వేర్పాటువాదంపైనే కాకుండా పేదరికంపై కూడా చారిత్రక విజయం సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ బ్యాంకు తాజా నివేదికను ప్రధాని ప్రస్తావించారు. గత కొన్నేళ్లలో భారత్‌లో దాదాపు 50 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని, దశాబ్దాల తరబడి ఇచ్చిన గరీబీ హటావో నినాదాలతో సాధ్యం కాని పనిని తమ ప్రభుత్వం చేసి చూపించిందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఆయన రంగోలితో పోల్చారు. రంగోలిలో చిన్న చిన్న ముగ్గులు కలిసి చివరకు ఒక అందమైన చిత్రాన్ని ఆవిష్కరించినట్లుగానే, అనేక పథకాలు కలిసి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని వివరించారు. జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది మందిని బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడం, పీఎం ఆవాస్ యోజనతో పక్కా ఇళ్లు, హామీ లేని ముద్రా రుణాలు, స్వనిధి పథకం, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్యం, ఉచిత రేషన్, స్వచ్ఛ భారత్, హర్ ఘర్ జల్ వంటి పథకాలు పేదల కనీస అవసరాలను తీర్చి వారిని ఆర్థికంగా నిలబెట్టాయని తెలిపారు. పేదరికంపై పోరాటానికి, నక్సలిజంపై చేపట్టిన చర్యలకు అవినాభావ సంబంధం ఉందని మోడీ అన్నారు. గతంలో నక్సల్స్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధిని అడ్డుకోవడమే తీవ్రవాదుల ప్రధాన ఎజెండాగా ఉండేదని చెప్పారు. పాఠశాలలు తెరవకుండా అడ్డుకోవడం, వాటిని తగుల బెట్టడం, ఆసుపత్రులు, వైద్యులు రాకుండా చేయడం, పోలియో వ్యాక్సినేషన్‌ను నిలిపివేయడం, మొబైల్ టవర్లు పెట్టనీయకపోవడం, రైల్వే ట్రాక్‌లను పేల్చి వేయడం వంటి చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఫలితంగా లక్షలాది మంది పేదలు, యువత తీవ్ర పేదరికంలో ఉండిపోయి, అభివృద్ధి అవకాశాలకు దూరమయ్యారని పేర్కొన్నారు.

నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కేవలం భద్రతా చర్యలే కాకుండా ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిందని మోడీ వివరించారు. భద్రతా దళాల పర్యవేక్షణలో 15వేల కిలోమీటర్లకు పైగా రోడ్లు నిర్మించామని, తొమ్మిదివేలకు పైగా మొబైల్ టవర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల పిల్లల కోసం సుమారు 200 ఏకలవ్య మోడల్ పాఠశాలలు, 50 ఐటీఐలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు నెలకొల్పినట్లు వెల్లడించారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా మారుమూల గిరిజన గ్రామాలకు తొలిసారిగా తాగునీరు, విద్యుత్, రోడ్డు కనెక్టివిటీ కల్పించామన్నారు. లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం కల్పించడంతో హింసాత్మక ఘటనలు ఆగిపోయాయని, బస్తర్ యువత ఇప్పుడు తుపాకులు వదిలి క్రీడలు, ఒలింపిక్స్‌లో పాల్గొనే స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. ఈ ముప్పు ఇంకా పూర్తిగా



తొలగిపోలేదని ప్రధాని హెచ్చరించారు. అడవుల నుంచి సాయుధ నక్సలైట్లను తుదిచిపెట్టాం. కానీ ఈ మేధో నక్సలైట్లు అనేక సంస్థల్లో తిష్టవేశారు. ఇప్పటికీ వారు దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఈ దిమాగీ నక్సల్స్ అనేక రాజకీయ పార్టీలు, ఇతర సంస్థల్లోకి చొరబడ్డారు. వారి కుట్రలను గుర్తించి, వారిని పూర్తిగా ఓడించి దేశాన్ని రక్షించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు.

రామప్ప బొగ్గు గనిపై నోటీసులు

జాతీయ హరిత ట్రిబ్యునల్ సుమోటోగా నమోదు

అఫిడవిట్లు దాఖలుకు ఐదు డిపార్టుమెంట్లకు ఆదేశాలు

చెన్నై దక్షిణ జోనల్ బెంచ్‌కు కేసు బదలీ చేసిన ప్రధాన ధర్మాసనం

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: ములుగు జిల్లాలో యునెస్కో గుర్తించిన రామప్ప ఆలయం, రామప్ప సరస్సు సమీపంలో ప్రతిపాదిత బొగ్గు గనిపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసింది. దీనిపై సంబంధిత వివిధ విభాగాల అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఎన్‌జిటి చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, సభ్యులు (నిపుణులు) డాక్టర్ అఫ్రోజ్ అహ్మద్ నేతృత్వంలోని ధర్మాసనం ఒరిజినల్ అప్లికేషన్ నెం. 594/2026ను నమోదు చేసింది. సింగరేణి ప్రతిపాదించిన మైనింగ్ ప్రాజెక్ట్ తీవ్రమైన పర్యావరణ, వారసత్వ పరిరక్షణ ఆందోళనలను లేవనెత్తుతోందని ట్రిబ్యునల్ పేర్కొంది.

రామప్ప సరస్సుకు 300 మీటర్ల పరిధిలో తవ్వకాలకు ప్రతిపాదన చేసినట్లు నివేదిక పేర్కొంది. సరస్సులోని నీటి మట్టాలు, భౌగోళిక రేఖాంశాలు, ఫాల్ట్‌ల ద్వారా ప్రతిపాదిత గని వైపు భూగర్భ జలాల కదలికను ప్రభావితం చేయగలవని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వ్యక్తం చేసిన ఆందోళనలను కూడా ఇది ఉటంకించింది. ఈ నివేదికల ప్రకారం బలహీనత సంకేతాలు చూపిస్తున్న ఆలయ 800 ఏళ్ల పురాతన ఇసుక పునాదిపై పడే ప్రభావం గురించి కూడా ప్రశ్నలు లేవనెత్తింది. పర్యావరణ నిబంధనలు, 1986 పర్యావరణ (పరిరక్షణ) చట్టం యొక్క అనుసరణపై ఈ విషయం గణనీయమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని ఎన్‌జిటి పేర్కొంది. ఈ నేపథ్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు, ములుగు జిల్లా కలెక్టర్, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ యొక్క చెన్నై ప్రాంతీయ కార్యాలయం, కేంద్ర భూగర్భ జల ప్రాధికార సంస్థను ప్రతివాదులుగా చేర్చింది. తదుపరి విచారణకు ముందు అఫిడవిట్ల ద్వారా సమాధానాలు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. రామప్ప బొగ్గు గనికి సంబంధించి దాని పరిధిలోని చెన్నైలోని ఎన్‌జిటి దక్షిణ జోనల్ బెంచ్‌కు ఈ కేసును బదిలీ చేస్తూ ప్రధాన ధర్మాసనం తదుపరి విచారణను డిసెంబర్ 21కు వాయిదా వేసింది.

తండ్రి, చిన్నారిని కబళించిన రోడ్డు ప్రమాదం

స్వగ్రామానికి వెళ్తుండగా మృత్యువు రూపంలో దూసుకొచ్చిన ట్రాక్టర్

కుటుంబ వేడుకకు బయలుదేరిన వారిని వెంటాడిన మృత్యువు

హుస్నాబాద్ రూరల్, నవంబరు 9, ప్రభాతవార్త: కుటుంబంతో కలిసి స్వగ్రామంలో జరిగే కార్యక్రమానికి ఆనందంగా బయలుదేరిన ఆ తండ్రికి మార్గమధ్యంలోనే మృత్యువు ఎదురైంది. తండ్రితో కలిసి ప్రయాణిస్తున్న ఏడేళ్ల చిన్నారి సైతం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. రెప్పపాటులో జరిగిన రోడ్డుప్రమాదం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భార్య, కుమారుడు గాయాలతో ఆసుపత్రి పాలవగా, తండ్రి, కుమార్తె విగతజీవులుగా మారిన హృదయవిదారక ఘటన హుస్నాబాద్ మండలంలో చోటుచేసుకుంది. హుస్నాబాద్ మండలం పందిళ్ల బ్రిడ్జి సమీపంలో కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన పైడపల్లి శ్రీకాంత్(33), ఆయన ఏడేళ్ల కుమార్తె మహోస్ని మృతి చెందారు. శ్రీకాంత్ హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తున్నారు. కొండాపూర్‌లో కుటుంబ కార్యక్రమం ఉండటంతో భార్య స్వాతి, కుమార్తె మహోస్ని, కుమారుడు శ్రీహాన్ కృష్ణతో కలిసి హైద రాబాద్ నుంచి కారులో స్వగ్రామానికి బయలు దేరారు. ప్రయాణం సజా వుగా సాగుతుండగా పందిళ్ల గ్రామం దాటాక కారు ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో శ్రీకాంత్, చిన్నారి మహోస్ని ప్రాణాలు కోల్పోయారు. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో కుటుంబ సభ్యుల ఆనందం ఆవిరైంది. భార్య స్వాతి, కుమారుడు శ్రీహాన్ కృష్ణ గాయ పడటంతో వారిని 108లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగ సిఫార్సు చేశారు.

తండ్రీకూతుళ్ల మృతిపై

మంత్రి పొన్నం దిగ్భ్రాంతి

హుస్నాబాద్ టౌన్: సిద్దిపేట-హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరీం నగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన పైడిపల్లి శ్రీకాంత్(33), ఆయన కుమార్తె మహోస్ని(7) మృతి చెందడం అత్యంత బాధా కరమని పేర్కొన్నారు. పండుగ వేళ కుటుంబంతో ఆనందంగా గడపాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమని, మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



శ్రీకాంత్, ఆయన కూతురు మహోస్ని (ఫైల్)

పోలీసు శాఖ అంతర్గత విచారణ?

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ అల్లాస్ జానయ్యకు తెలంగాణ మహిళా కమిషన్ సోమ వారం నోటీసులు జారీ చేసింది. మహిళా అసిస్టంట్ ప్రొఫెసర్‌ను లైంగికంగా వేధించినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఆయనకు మహిళా క మిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 12 వ తేదీన విచారణకు హాజరుకావాలని మహిళా కమిషన్ ఆదేశించింది. వీసీ అల్లాస్ జానయ్య త నను లైంగికంగా వేధించారంటూ మహిళా అసిస్టంట్ ప్రొఫెసర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. అయితే తన ఫిర్యాదుపై ఎవ రూ స్పందించడం లేదని సదరు అధ్యాపకురాలు

మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫిర్యాదుతో

వ్యవసాయ వర్సిటీ వీసికి మహిళా కమిషన్ నోటీసులు

నేరుగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కొందరు ఉద్యోగులు, విద్యార్థులతో పాటు మీడియా సమా వేశం నిర్వహించి వీసీ అల్లాస్ జానయ్య తనను ఎలా వేధించారనే దానిపై కన్నీటి పర్యంతమవడం విదితమే. మరోవైపు ఆమె ఆరోపణలను వ ర్శిటీకి చెందిన ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు ఖండించడంతో పాటు ఇదంతా కొందరు కావాలని ఆడుతున్న నాటకమని తెలిపారు. కాగా సోమవారం ఉదయం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఉద్యోగులతో పాటు విద్యార్థులు వీసీ అల్లాస్ జానయ్యపై వచ్చిన లైంగిక వేధింపులపై విచారణ జరగాలని, ఒకవేళ ఆయన దోషి అయితే చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు రాష్ట్ర మహిళా కమిషన్ ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించి వీసీ అల్లాస్ జానయ్యకు నోటీసులు ఇచ్చింది. ఈ కేసులో వీసీ అల్లాస్ జానయ్య నుంచి వివరణ అ ందాక ఆయనపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు వీసీ అల్లాస్ జానయ్య ఉదంతంపై పోలీసు శాఖ అంతర్గ తంగా విచారణ చేబట్టినట్లు తెలిసింది. ఆయనపై ఆరోపణలు చేసిన మహిళా అధ్యాపకురాలి నుంచి వివరాలు సేకరించి తదుపరి దీనిపై సర్కారుకు నివేదిక అందించనుంది.

దీపావళి టపాసుల ఎఫెక్ట్

బాణసంచా ప్రమాదాల్లో పలువురికి కంటిగాయాలు

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: దీపావళి వెలుగుల పండుగ కొందరి జీవితాల్లో చీకట్లు నింపింది. టపాసుల మోతతో భాగ్యనగరం మార్మో గినా.. బాణసంచా ప్రమాదాలు పలువురిని ఆసుపత్రుల పాలు చేశా యి. అనంతరంగా టపాసులు కాల్చేందుకు వెళ్లినవారు కంటి గాయాలతో వైద్యశాలలకు పరుగులు తీశారు. ముఖ్యంగా చిన్నారులు, యువకులు బాణసంచా ప్రమాదాలకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 7వ తేదీ నుంచి సోమవారం వరకు హైదరాబాద్‌లోని నాలుగు ఆసుపత్రుల గణాంకాల ప్రకారం కనీసం 172 మంది బాణసంచా సంబందిత గాయాలతో చికిత్స పొందినట్లు సమచారం. వీరిలో అత్యధికంగా కంటి గాయాల బాధితులున్నారు. మెహిదీపట్నంలోని ప్రభుత్వ సరోజినీదేవి కంటి ఆసుపత్రుల్లో బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సోమవారం ఉదయం వరకు ఈ ఒక్క ఆసుపత్రిలోనే సుమారు 73 మంది కంటి గాయాలతో ఆసుపత్రికి వచ్చారు.వీరిలో 31 మంది 18 ఏళ్లలోపు చిన్నారులు కావడం గమనార్హం. 13 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చగా, తొమ్మిది మందికి శస్త్రచికిత్సలు అవసరమయ్యాయి. ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గత ఏడాది దీపావళి సందర్భంగా సరోజినీదేవి ఆసుపత్రుల్లో 54మంది గాయాల కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఆ సంఖ్య గణనీయంగా పెరిగినట్లు ఆస్పత్రి గణాంకాలు పేర్కొంటున్నాయి. టపాసులు కాల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, అప్రమత్తంగా వ్యవహరించకపోవడం వల్లే కంటి గాయాలు ఎక్కువగా నమోదవు తున్నా యని డాక్టర్లు చెబుతున్నారు. ముఖ్యంగా బాణసంచా పేల్చే సమయంలో వెలువడే నిప్పురవ్వలు నేరుగా కళ్లపై పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీపావళి వేడుకల సమయంలో బాణసంచా కాల్చే టప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, పిల్లలను పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చనివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

తెలంగాణలో జనగణనకు నోటిఫికేషన్ జారీ

జనవరి 25 నుంచి ఇంటింటి సర్వే నిర్వహణ

హైదరాబాద్,నవంబరు9,ప్రభాతవార్త: రాష్ట్రంలో జనగణన 2027కు తెలంగాణ ప్రభుత్వం తేదీలు ఖరారు చేసింది. అందుకు సంబంధించిన జీఓ ఎంఎస్ నెం.155ను సోమవారం ప్రభుత్వం జారీ చేసింది. జనవరి 25వ తేదీ నుంచి ఇంటింటి జనాభా లెక్కల సేకరణ చేపడతారు. ఫిబ్రవరి 28 వరకు ఈ జనగణన ప్రక్రియ కొనసాగుతోంది. అయితే జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు (సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానంలో)స్వీయ జనగణనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ప్రజలే స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ఈ వెసులుబాటు కల్పించింది. ఇక మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ చేపట్టనుంది. 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు ప్రామాణిక తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర హోం శాఖకు చెందిన రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ కార్యాలయం అక్టోబర్ 30న జారతీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం ఈ అధికారిక నోటిఫికేషన్ రాష్ట్ర గెజిట్‌లో ఎపునఃప్రచురించింది. రాష్ట్రంలో మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి విడతలో ఇళ్ల గణన పూర్త యింది. రెండో విడతలో జనాభా లెక్కల సేకరణ కోసం ఇప్పటికే సన్నాహక సమావేశాలతో పాటు సిబ్బంది నియామకం, శిక్షణ ప్రక్రియ జరుగుతోంది.

డిజిటల్ పద్ధతిలో వివరాల సేకరణ

ఈసారి జనాభా గణనను పక్కాగా, డిజిటల్ పద్ధతిలో నిర్వహించేందుకు వీలుగా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ బృహత్తర ప్రక్రియను ఎలాంటి అంతరాయం లేకుండా పూర్తి చేసేలా క్షేత్ర స్థాయి సన్నాహాలు చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్,జిల్లా కలెక్టర్లు,సంబంధిత అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



పరిగిలో అరెస్టయిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు : ఖండించిన కెటిఆర్

ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని సోమవారం పరిగి పోలీసులు అరెస్టు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి మూడురోజులుగా సొంత నియోజకవర్గంలో పర్యటిస్తున్నం దున ముందస్తుగా మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేసినట్లు చెబుతున్నారు. అయితే, కోస్గిలో పార్టీ నేత మృతి చెందగా వారి కుటుంబాన్ని ఓదా ర్చేందుకు వెళుతుండగా తనను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. తనకు పోలీసు రక్షణ కల్పించి కోస్గికి తీసుకు వెళ్లానని ఆయన పట్టుబట్టారు. చిల్లర రాజకీయాలను మానుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అప్పటివరకు తన వాహనం దిగబోనని పోలీసు ఉన్నతాధికా రులకు స్పష్టం చేశారు. కొంతసేపు ఉద్రిక్తత నెలకొన్నది. అనంతరం ఆయనను అరెస్టుచేసి పోలీసు స్టేషన్‌కు తరలిం చారు. ఆయన వెంట పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. పరిగిలో కొంత ఉద్రిక్త పరిస్థి తులు నెలకొన్నాయి. నరేందర్‌రెడ్డి అరెస్ట్ సమాచారం తెలుసుకున్న బిఆ ర్ఎస్ అగ్రనేత కెటిఆర్ తీవ్రంగా స్పందించారు. కార్యకర్త చనిపోతే వారి కుటుంబాన్ని పరామ ర్శించడం కూడా తప్పా అంటూ ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి అండగా నిలబడటం నేరమా అన్నారు. ప్రతిపక్ష నేతల గొంతు నొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలే కాంగ్రెస్ పాలన అన్నారు. కక్ష సాధింపు చర్యలకు భయపడబోమని, ప్రజల తరపున పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. బేషరతుగా నరేందర్‌రెడ్డిని విడుదల చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల ఆత్మహత్యల జోరు

మార్కుల వేటలో పెరిగిన మానసిక ఆందోళన

కార్పొరేట్ విద్యావిధానంతో పెరిగిన ఒత్తిడి

ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్: గత కొంతకాలంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు పాల్పడు తున్న ఘటనలు పెరుగుతున్నాయి. కేవలం వారం పది రోజుల్లోనే ఎనిమిది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరిలో బిటెక్, ఇంటర్ విద్యార్థులే అధికంగా ఉన్నారు. ఒకప్పుడు పరీక్షా ఫలితాలు వచ్చిన తరువాత తాము ఆశించిన మార్కులు రాలేదనో, ఉత్తీర్ణత పొందలేదన్న ఆందోళనలో ఆత్మహత్యలకు పాల్పడటం జరిగేది. అయితే ఇటీవల కాలంలో పరీక్షలకు ముందే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇంటర్ మీడియట్ పరీక్షలు మరో 24 గంటల్లో వెలువడు తాయనగా తాము ఫలితాల సాధనలో విఫలం చెందుతామన్న భయంతో ఆత్మహత్య చేసుకున్నారు. ఫలితాలు వచ్చిన తరువాత ఇద్దరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలపై ఆందోళనలో తెలంగాణలో ఈ ఏడాది ఏప్రిల్ 13న ఒక్కరోజులోనే ఏకంగా 11 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

వార్త

మాటకు మాట ప్రతీకారం కాదు,
మౌనమే దానికి సమాధానం.

న- ప్లినీ

వార్ధక్యమూ ఓ ప్రవాహమే!

సమాజంలో ప్రతి ఒక్కరూ ఏమి చేసినా సరే ఎక్కువ కాలం బతకాలని కోరుకుంటున్నారు. అందుకనే ఇటీవల మానవుని సగటు జీవించే వయసు కూడా పెరిగింది. ఆ కారణంగానే ఎలాంటి ఆయు: ప్రమాణాలు పెంచే వైద్య విధానాలున్నా వాటిని అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఊబకాయంతో బాధపడేవారు సైతం ఆరోగ్యం కోసం ఆందోళన పడుతున్నారు. ప్రస్తుతం ప్రజలు ఎక్కువ కాలం జీవించడమే కాకుండా, నాణ్యమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటున్నారు. శరీరం ఎంత యౌవనంతో కనిపించినా మెదడు మాత్రం అంత కంటే వేగంగా వృద్ధాప్యంలోకి వెళ్లే ప్రమాదం ఎక్కువే నన్న విషయం గుర్తించడంలో శాస్త్రజ్ఞులు ఒక అడుగు ముందే ఉన్నారు. వృద్ధాప్యం అంటే చాలామంది తెల్ల జుట్టు, ముడతలు, శారీరక మార్పులనే అనుకుంటారు. రోజువారీ జీవనశైలిలోని కొన్ని చెడు అలవాట్లు జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. వైద్య నిపుణుల ప్రకారం పుట్టిన తేదీ ప్రకారం ఉన్న వయసు కంటే మెదడు జీవశాస్త్రీయ వయసు (బయోలాజికల్ ఏజ్) ఎక్కువగా ఉండొచ్చు. దీన్నే బ్రెయిన్ ఏజ్ గ్యాప్ అంటారు. ఇది పెరిగితే భవిష్యత్తులో జ్ఞాపకశక్తి క్షీణించడం, అల్జీమర్స్, స్ట్రోక్ వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. దాదాపు 40 వేల మంది బ్రెయిన్ స్కాన్‌లపై జరిగిన పరిశోధనల్లో మెదడు వయసు ప్రతి ఏడాది పెరిగిన కొద్దీ అల్జీమర్స్ ప్రమాదం సుమారు 16.5 శాతం, మరణముప్పు దాదాపు 12శాతం పెరుగుతుందని గుర్తించారు. ముఖ్యంగా మెదడు ఏజ్ నిజమైన వయసు కంటే 2.5 సంవత్సరాలు ఎక్కువైతే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, స్పందన వేగం మరింత తగ్గుతాయని అధ్యయనాల అంచనా. మెదడు వేగంగా వృద్ధాప్యానికి గురికావడానికి దీర్ఘకాలిక ఒత్తిడి, నిద్రలేమి, ప్రాసెస్డ్ ఆహారం ఎక్కువగా తినడం, ఒంటరిగా జీవించడం వంటి అలవాట్లు ప్రధాన కారణాలని వైద్యులు చెబుతున్నారు. ఒత్తిడి వల్ల విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్ జ్ఞాపకశక్తికి కీలకమైన హిప్పోక్యాంపస్‌పై ప్రభావం చూపుతుంది. అలాగే మెదడు కణాల పునరుద్ధరణను 'నిద్రలేమి' దెబ్బతీస్తుంది. వృద్ధ ఎలుకల గట్‌లోపారా బాక్టీరాయిడ్స్ గోల్డ్‌స్టీనీ అనే బ్యాక్టీరియా పెరుగుదల కనిపించింది. ఈ బ్యాక్టీరియా జ్ఞాపకశక్తి తగ్గుదలతో నేరుగా సంబంధం ఉందని గుర్తించారు. ఈ బ్యాక్టీరియాను యువ ఎలుకల గట్‌లో ప్రవేశపెట్టగా, వాటి గుర్తింపు సామర్థ్యం తగ్గడం, మెజ్ పరీక్షల్లో పని తీరు దెబ్బతినడం గమనించారు. అయితే మెదడు వృద్ధాప్యాన్ని కొంతవరకు నెమ్మదింప జేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. రోజూ నడక లేదా వ్యాయామం చేయడం, సరిగా నిద్రపోవడం, పుస్తకాలు చదవడం, పజిల్స్ పరిష్కరించడం, కొత్త విషయాలు నేర్చుకోవడం,కుటుంబ సభ్యులు, స్నేహితులతో సన్నిహితంగా ఉండడం వంటి అలవాట్లు మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయని సూచిస్తున్నారు. భారతదేశంలోని రాష్ట్రాల్లో జీవించేవారి సగటు ఆయుష్షును పరిశీలించినట్లయితే ఉత్తరప్రదేశ్ ,బీహార్, మధ్యప్రదేశ్‌లలో వారు 65 నుండి 67 సంవత్సరాలు జీవిస్తారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ జ్ఞాపకశక్తి తగ్గుదల సాధారణంగా కనిపించే సమస్య. అయితే వృద్ధాప్యంతో వచ్చే జ్ఞాపకశక్తి తగ్గుదలను తిరిగి మెరుగుపరచడంలో గట్ మైక్రోబియోమ్ (మంచి బ్యాక్టీరియా) కీలక పాత్ర పోషించవచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా గట్ (జీర్ణ వ్యవస్థ) నుంచి మెదడుకు సంకేతాలు పంపే వెగస్ నర్వ్‌ను ఉత్తేజితం చేయడం ద్వారా ఈ ప్రభావం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. వయస్సు పెరిగేకొద్దీ ఆరోగ్య సమస్యలకు గట్‌లో పరిష్కారాలను కనుగొనే దిశగా పరిశోధనలు సాగుతున్నాయి. కొంతమంది వృద్ధులు ఎందుకు మానసికంగా చురుకుగా ఉంటారో, మరికొందరిలో 50-60 ఏళ్ల వయస్సు నుంచే జ్ఞాపకశక్తి తగ్గుదల ఎందుకు మొదలవుతుందో తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ పరిశోధనలు జరిగాయి. జ్ఞాపకశక్తి తగ్గుదల అనేది ముందే నిర్ణయించబడిన ప్రక్రియకాదని, శరీరంలోని పలు వ్యవస్థలు దీనిని ప్రభావితం చేస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ ఈ ప్రక్రియలో కీలక నియంత్రకంగా పనిచేస్తుందని నిపుణులు వెల్లడించారు. మల్టీ విటమిన్లు తీసుకున్న వారిలో వృద్ధాప్య ఛాయలు గణనీయంగా తగ్గినట్లు తేలింది. ముఖ్యంగా, తమ అసలు వయసు కంటే జీవసంబంధ వయసు ఎక్కువగా ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించింది. ఈ ఫలితాలపై సీనియర్ పరిశోధకుడు హోవార్డ్ సెన్సో మాట్లాడుతూ, 'ప్రస్తుతం ప్రజలు ఎక్కువకాలం జీవించడమే కాకుండా, నాణ్యమైనజీవితాన్ని గడపాలని కోరుకుంటున్నారు. కణాలస్థాయిలో శరీరం ఎంత వేగంగా వృద్ధాప్యం చెందుతుందో తెలుసుకోవడానికి,వారి డీఎన్ఏలోని రసాయనిక మార్పుల ఆధారంగా పనిచేసే'ఎపిజెనెటిక్ క్లాక్స్'ను విశ్లేషించారు. మల్టీ విటమిన్ల వాడకంతో జీవసంబంధ వృద్ధాప్య సూచికలలో సానుకూల మార్పులు రావడం ప్రోత్సాహకరంగా ఉంది అని వివరించారు. వృద్ధాప్యానికి దారితీసే కొన్ని జీవసంబంధ ప్రక్రియలను నియంత్రించగలిగినప్పుడే మానవ ఆయుర్దాయం పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగావృద్ధాప్య ఛాయలు మానవ సహజత్వ వయసుపై ప్రభావితం చూపిస్తున్నందున జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి.

> శారీరకంగా కానీ, మానసికంగా కానీ నైతికంగా కానీ, ఆధ్యాత్మికంగా కానీ ఏ విధంగా కూడా బలహీనత పనికిరాదు.
>
> **స్వామి వివేకానంద**



> లక్ష్యం మీద చూపించే శ్రద్ధ దాన్ని సాధించే సాధనా విధానాల మీద కూడా చూపించినప్పుడే లక్ష్యసిద్ధి జరుగుతుంది.
>
> **ఎమర్సన్**



ప్రజావాక్కు

రైతులు ఆలోచించాలి

తరచు వచ్చే తుఫాన్ల తాకిడికి తీర ప్రాంత రైతుల పైర్లు రోజుల తరబడి నీటమునిగి, వారు తీవ్రంగా నష్టపోతున్నారు. కనుక ఈసమస్యకి పరిష్కారంగా ఆ ప్రాంతాల్లో ఇసుక శాతం ఎక్కువగా వుండి, త్వరగా నీరు పీల్చుకునే గరప నేలల్లో మెట్ట వరిసాగుకి ప్రయత్నించాలి. దీనివల్ల వరద నీరు త్వరగా ఇంకి పోవటమే కాక, మెట్ట వరికి పెట్టుబడి, దమ్ము, కూలీల ఖర్చులు కూడా గణనీయంగా తగ్గుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అరవై సంవత్సరాల క్రితం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించక ముందు పల్నాడు, నర్సరావుపేట ప్రాంతాల్లో జొన్న, మెట్ట వరి పైర్లు వేసేవారు. పండితే లాభమే, దురదృష్టవశాత్తు పంట దెబ్బతిన్నా పెద్ద నష్టం వుండేది కాదు. కృత్రిమ ఎరువుల్ని వాడక, సహజ సిద్ధమైన పశువుల పేడనే ఎరువుగా వాడారు. కనుక ఇప్పుడు కూడా తీర ప్రాంత రైతులు సాధ్యమైన మేర మెట్ట వరి, జొన్న, కంది వంటి డిమాండ్ వున్న పైర్ల వైపు మొగ్గి, తుఫాన్ నష్టాలు తగ్గించుకోవాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

కూటమి ప్రభుత్వం ఆశయాలు

ప్రస్తుతం జరిగిన మున్సిపల్, జడ్పిటీసీ, ఎమ్పిటిసి ఎన్నికలలో విజయంసాధించిన విజేతలు అందరికీ అభినందనలు! అయితే వీరు ప్రజలచే ఎన్నుకోబడిన వారు కాబట్టి కూటమి ప్రభుత్వం ఆశయాలు నిలబెట్టాలి. ప్రజా సమస్యలు పరిష్కరించాలి.ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఉండాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వారికి వివరించాలి. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసంచేపట్టే ప్రతీ అభివృద్ధి కార్యక్రమం ప్రజల మన్ననలు పొందాలంటే ఈప్రభుత్వం ఆశయాలు నాయకులు నిజంచేయాలి. ప్రతిపక్షం విమర్శలు తిప్పి కొట్టాలి.

- ఎల్. ప్రవుల్ల చంద్ర, ధర్మవరం

నిర్ణయాలపై పరిశీలన

అంతర్జాతీయ విధానాలా కంటే స్వదేశీ విధానాల పైన ఎక్కువ ఫోకస్ చేయాలి అని అమెరికన్ పౌరులు ఒక సందేశాన్ని ట్రంప్‌కు ఇచ్చారు.అయితే డెమోక్రట్‌లు ఎక్కువ స్థానాలలో గెలుపొందడం వల్ల ట్రంప్ తీసుకునే నిర్ణయాలపైనా నిషితమైన పరిశీలన జరుగుతుంది. ఇష్టం వచ్చినట్టుగా నిర్ణయాలు తీసుకోలేకపోవచ్చు. మొత్తంగా ఒళ్లు దగ్గర పెట్టుకొని పని చేయమని సందేశం ఇచ్చారు.

-భారత అవినాష్, జనగామ

ఇదేమి ప్రభుత్వం ?

తిరుపతి జిల్లాలో బీఎన్ కండ్రిక మండలంలో కల్కి ట్రస్టు వారు సర్వేనంబర్295లో అంజూర్ అటవీభూమినీ 20.75 ఎకరాలు ఆక్రమించాడు. అది శ్రీనివాస మొదలి అనే వానికి బ్రిటిష్ కాలంలో ఇచ్చారని ,దాన్ని అతను వేరేవారికి అమ్మగా ,దాన్ని కల్కి ట్రస్టువారు కొన్నారని రెవెన్యూ వాళ్లు నాటకాలు ఆడుతున్నారు. బ్రిటిష్ వారు ఇచ్చిన ఒరిజినల్ పత్రాలు ఇవ్వమని ఆర్టీ కింద అడిగితే ఎమ్మార్వో ,కలెక్టరు నావద్ద లేవని సమాధానం ఇచ్చారు. మరి ఒరిజినల్స్ లేకుండా ఎలా అమ్మారు?కొన్నారు?అయిన ఈనాంభూములను కొనకూడదు. అమ్మకూడదు. మరి ఏమిటి ఈ నాటకాలు? ప్రభుత్వం చెప్పాలి.చంద్రబాబు గారూ మాది చాలా పారదర్శక మైన పాలన అని మీరుకబుర్లు చెప్తున్నారు. మీ అధికారులు దొంగబాబాల దగ్గర లంచం తీసుకొని గాని, ఇంకో విధంగా గానీ దొంగలకు అనుకూలంగా పనిచేస్తున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

జలవనరుల పరిరక్షణ

నీరు లేకుండా జీవనం లేదు.అలాంటి అమూల్యమైన జలవనరుల పరిరక్షణకు సుప్రీంకోర్టుజోక్యం అవసరమవడం ఆలోచించాల్సిన విషయం. పౌరుల జీవించే హక్కుల్లో స్వచ్ఛమైన తాగునీటి లభ్యత కూడా అంతర్భాగమే. చెరువులు, సరస్సులు, కుంటల సరిహద్దులను గుర్తించి,ఆక్రమణల నుంచి రక్షించాల్సిన అవసరాన్నిన్యాయస్థానం గుర్తుచేయడం అత్యంత ప్రాధాన్యమైన పరిణామం. దేశవ్యాప్తంగా పట్టణీకరణ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అనేకచారిత్రక జలాశయాలు ఆక్రమణలకు గురవుతున్నాయి.జలాశయాలను కాపాడటం అంటే కేవలం నీటిని నిల్వ చేయడం కాదు, భావితరాల జీవించే హక్కును రక్షించడం. నీటి వనరుల పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.

- సి.పెాచ్.ప్రతాప్, శ్రీకాకుళం

మధుర స్వప్నం

నిజ జీవితంలో కన్నాకలలో వస్తున్నదృశ్యాలే బాగా ముధరంగా ఉంటాయి. కలలు కనండి వాటిని నిజం చేసుకోవడానికి శ్రమించండిఅన్న భారతమాజీ రాష్ట్రపతి భారతరత్న స్వర్గీయ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాంకు సలాం. రాగద్వేషాలు, ప్రేమ స్వప్నాలు అన్నిఅందరికి వస్తుంటాయి. పురాణాల్లో దేవతలకు ఇష్టమైన చోట ఈ ప్రదేశం నాకు నచ్చింది ఇక్కడ గుడి కట్టించు అని స్వప్నంలో చెప్పిన సందర్భాలనేకం.

- ఆర్.వెంకటేశ్ చరన్, బెంగళూరు

అవినీతి రహిత సమాజం సాధ్యమేనా?

భారతదేశాన్ని పూర్తిగా అవినీతి రహితంగా మార్చడం ఒక గొప్పలక్ష్యం అయితే సున్నాఅవినీతికి ఆస్కారం ఉంటుందా అనేది ప్రశ్నార్థకమే. కానీ అవినీతిరహిత సమాజం కోసం ప్రతిఒక్కరు బాధ్యతగా ఉండాల్సిన అవసరంఉంది. కాని తరచుగాజరిగే అవినీతిని సులభంగా గుర్తించడం తద్వారా, నేరం నిరూపితమైన సందర్భాలలో శిక్ష తప్పనిసరిగా ఉండేలా చేయాలి. అయితే అవినీతికి అవకాశం ఇవ్వకుండా పారదర్శకతను తప్పనిసరి చేయాలి. జవాబుదారీతనం అమలు చేయాలి. గ్రామ స్థాయి నుంచి మొదలు రాష్ట్ర, జాతీయస్థాయి వరకు వ్యక్తులను మార్చడం కంటే వ్యవస్థను మార్చడం ముఖ్యం.

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో అవినీతి లంచగొండితనం చాపకింద నీరులా విస్తరిస్తూ ఉందని అంటుంటారు.ప్రభుత్వాలు అవినీతి నిర్మూలనకు ఎంతగానో ప్రయత్నిస్తున్నప్పటికీ, ఎక్కడో ఒక చోట అవినీతిని అంతం చేయాలనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడంలేదని సంశయం సమాజంలో లేకపోలేదు.అయితే నిరంతరంగా కాలంతో పాటు అన్ని వ్యవస్థల్లో చాలావరకు లంచగొండితనం, అవినీతి అక్రమాల ఆరోపణలు తెరపైకి వస్తూనే ఉండడం విచారకరం. సమాజంలో ప్రభుత్వాలు ఎక్కువగా అవినీతిని నియంత్రించాలి అనుకున్నా కొన్నిసార్లు రాజకీయ వ్యవస్థలోనే అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలను తరచుగా వినిపిస్తుంటాయి. ఇలాంటి అవినీతి లంచగొండితనం ఆర్థిక కుంభకోణాలు లాంటిఆరోపణల విషయాల్లో పట్టుబడుతున్నవారికి శిక్షపడ్డ దాఖలాలు చాలా తక్కువనే గోచరిస్తుండడం గమనార్హం. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా ఉంటున్నప్పటికీ ప్రతిరోజు ఏదో ఒకచోట అక్రమ సంపాదన అవినీతి కుంభకోణాలకు పాల్పడుతున్న సంఘటనలు విభిన్నరకాల వ్యవస్థలో జరుగుతున్నట్టు వార్తలు వస్తుంటాయి. ఈ క్రమంలో అడపా దడపా జరిగే సంఘటనలే కాకుండా నిరంతరం కొనసాగుతున్న అక్రమ సంపాదన, అవినీతి లంచగొండితనం నియంత్రించడం కష్టసాధ్యమవుతుందా అనిపిస్తుంటుంది. దీనికి ప్రధానంగా ప్రభుత్వ యంత్రాంగంలో కొంతమంది ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మరికొంతమంది లంచగొండితనం, అక్రమార్జనకు పాల్పడుతున్న విధానాలు వల్ల కూడా దేశ ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటప్పుడు ఎంత పర్యవేక్షణ ఉన్నా అవినీతికి ఆస్కారం లేకుండా చట్టపరమైన విధానాలను మరింతగా కఠినతరం చేయవలసిన ఆవశ్యకత ఉంటుందేమో. దేశ ఆర్థికవిధానాల్లో వివిధ వ్యవస్థలో పేదసామాన్య మానవుని మొదలు ప్రతి ఒక్కరి దగ్గరనుండి వివిధ రూపాల్లో పన్నులు జమ కాబడిన సంపదగా ఉన్నటువంటి దేశ ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేసే రీతిలో కొంతమంది వక్రమార్గంలో అవినీతికి అలవాటు పడడం సర్వసాధారణం అయిపోతుంది. అంతేకాకుండా కొంతమంది బ్యాంకులనుండి కోట్ల రూపాయల రుణాలుతీసుకుని నష్టం జరిగిందనే సాకుతో చట్టపరమైన ప్రక్రియలో తీసుకున్న రుణాన్ని దాదాపుగా మాఫీ చేసుకుంటున్న తీరు కొన్నిసార్లు ఆశ్చర్యం వేస్తుంటుంది. రాజ్యాంగబద్ధమైన చట్టపరమైన వ్యవహార శైలితో పారులు బాధ్యతతో భారత దేశం అవినీతిరహితంగా నిలపాలి అనే ఆలోచన విధానం ప్రతి మానవుని మనసులో స్పష్టంగా ఉంటే ఎంతో కొంతైనా అవినీతిని, లంచగొండితనాన్ని నిరోధించే అవకాశం ఉంటుంది. పన్నులు ఎగ్గొట్టే వారు కొందరైతే క్రమం తప్పకుండా బాధ్యతగా పన్నులు కట్టే సామాన్య ప్రజలు ఎంతో మంది ఉంటారు. ఇలా దేశాన్ని ఆర్థికంగా నష్టపోకుండా కష్టపడి పన్నులను



స్థాయిలో నుండి మారుమూల ప్రాంతాల వరకు సమగ్రంగా అవినీతికి ఆస్కారం లేని వ్యవస్థలను నిర్మించుకొని అవినీతికి పాల్పడే వారు సులభతరంగా తప్పించుకోకుండా చట్ట ప్రకారం వెసులుబాటు లేకుండాకఠినమైన శిక్షలకొరకు ప్రభుత్వాలు మరిన్ని సవరణలు చేయాల్సిన అవసరం ఉంది. అయితే కేవలం నీతి నిజాయితీ గల వ్యక్తుల వల్ల అవినీతి, లంచగొండితనం, అక్రమ సంపాదన తగ్గిపోతుందని అనుకోవడం సరికాదేమో. వ్యక్తులు మారినా వ్యవస్థలు నీతి నిజాయితీగా పనిచేసే విధంగాఉండాలి. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ వ్యవస్థల్లో ఉన్న కార్యాలయాల్లో కూడా సులభంగా పనులు చేసుకోవడానికి కొంతమంది ఉద్యోగులు కొన్నిసార్లు లంచం ఆడిగే విధానాల వల్ల అవినీతి ఆలోచనలకు కారణమవుతున్నాయేమో అనిపిస్తుంది. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక ఉపకరణాలు ఉపయోగించుకుని ఆన్లైన్‌విధానాన్ని ప్రభుత్వ సేవలకు వినియోగిస్తున్నప్పటికీ ప్రతి దరఖాస్తుదారునికి న్యాయపరమైన చట్టబద్ధంగా సమ్మతం ఉన్నటువంటివాటికి ఆటోమెటిక్‌గా అప్రూవల్ విధానాన్ని అమలు చేస్తూ అధికారికంగా డిజిటల్ రసీదులు ఇస్తే బాగుంటుందనే భిన్న అభిప్రాయాలు లేకపోలేదు. ప్రధానంగా వ్యాపార లైసెన్సుల కోసం, బిల్డింగ్ అనుమతులు, భూమి రికార్డులు,కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ లాంటి తదితర పనుల కోసం లంచాలు ఇవ్వవలసిన అవసరం ఉండకూడదు. తరచుగా జరుగుతున్న అవినీతి కేసులపై న్యాయవ్యవస్థ మరింత ప్రత్యేక దృష్టి సారించి వీలైతే త్వరితగతిన కేసులు పూర్తి చేసి అవినీతి ఆరోపణల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఉదాహరణకు ప్రభుత్వం ప్రజల అవసరాల కొరకు, అభివృద్ధి కొరకు సరిపడా రూపాయలను కేటాయిస్తే కార్యాచరణలో అవినీతికి లంచగొండితనానికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా కేటాయించిన డబ్బులు ఎలా ఖర్చవుతుంది? ఎప్పటికప్పుడు లెక్కలతో సహాప్రజలు తెలుసుకునేలా సాంకేతిక ఉపకరణాలు తదితర సమాచార వ్యవస్థలతో అందుబాటులోకి ఉండేవిధంగా సంబంధితవిభాగాలు నిష్పక్షపాతంగా ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల అభివృద్ధికి పాటుపడే విధానాలను మరింతగా అవలంబిస్తే మంచిది. ఆర్టిఫీషియల్ ఇంటెలి జెన్స్ లాంటి సాంకేతిక పద్ధతుల ద్వారా కూడా అనుమానాస్పద అవినీతి ఆరోపణల అంశాలను గుర్తించాలి. అయితే చర్యలు తీసుకునే ముందు మానవ నిష్పక్షపాత విచారణ ఆధారాలను పరిశీలనకు తీసుకొని సంబంధిత విభాగాలు విశ్వసనీయతను అంచనా వేయాల్సి ఉంటుంది. అవినీతి అని అనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన వ్యక్తులకు రక్షణ కల్పించినప్పుడు అవినీతి జరుగుతున్న క్రమాన్ని నిర్భయంగా వాళ్లు ఫిర్యాదు చేయడానికి ముందుకు వస్తారు. దీనికి పరిష్కారంగా రాష్ట్ర, జాతీయస్థాయిలో సురక్షితమైన ఫిర్యాదుల వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందనే వాదనలు లేకపోలేదు. చట్టం ముందు అందరూ సమానమే అన్నట్టు ప్రజానాయకులైన ప్రభుత్వ ఉద్యోగులు అయినా మరెవరైనా గానీ చిన్నా పెద్ద ఉద్యోగం అనే తేడా లేకుండా అవినీతి నిరూపితమైన సందర్భాలలో చట్టప్రకారం నిర్దయాత్మకమైన కార్యచరణ త్వరితగతిన అమలు జరగాలి. ప్రతి ప్రభుత్వ శాఖకు ప్రజల ముందు జవాబుదారీతనం ఉండటంతోపాటు ప్రతినెలా ప్రతిప్రభుత్వ శాఖలు తమ పనితీరును ఎప్పటికప్పుడు ప్రజలకువెల్లడించే విధానాలపై మరింత దృష్టి సారించాలి. సరైనరీతిలో విశ్వసనీయత కలిగినటువంటిఫిర్యాదుల సమాచారం ఉంటేనే సంబంధిత అవినీతినిరోధక విజిలెన్స్ వ్యవస్థలు నిష్పక్షపాతంగా సాధ్యమైనంత వరకు మరింతగా స్పందించి అవినీతికి ఆస్కారం లేకుండా వ్యవస్థలపై నిరంతరం నిఘా కొనసాగించాలి. ఏదిఏమైనప్పటికీ భారతదేశాన్ని పూర్తిగా అవినీతి రహితంగా మార్చడం ఒక గొప్పలక్ష్యం అయితే సున్నాఅవినీతికి ఆస్కారం ఉంటుందా అనేది ప్రశ్నార్థకమే. కానీ అవినీతిరహిత సమాజం కోసం ప్రతిఒక్కరు బాధ్యతగా ఉండాల్సిన అవసరంఉంది. కాని తరచుగాజరిగే అవినీతిని సులభంగా గుర్తించడం తద్వారా, నేరం నిరూపితమైన సందర్భాలలో శిక్ష తప్పనిసరిగా ఉండేలా చేయాలి. అయితే అవినీతికి అవకాశం ఇవ్వకుండా పారదర్శక తను తప్పనిసరిచేయాలి.జవాబుదారీతనం అమలు చేయాలి.గ్రామ స్థాయినుంచి మొదలురాష్ట్ర,జాతీయస్థాయి వరకు వ్యక్తులను మార్చడం కంటే వ్యవస్థను మార్చడం ముఖ్యం.

ఇ20నా, ఇ40నా? నిజం తేలాల్సిందే!

కొలను వెంకటేశ్వర రెడ్డి

ఇథనాల్ మిశ్రమంపై సంచలన ఆరోపణలు, చమురు కంపెనీల ఖండన, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు స్పష్టమైన సమాధానం కావాలి. దేశంలో పెట్రోల్ ధరలపై ప్రజలకు ఎప్పటినుంచో ఆందోళన ఉంది.ఇప్పుడు పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ శాతం కొత్త వివాదానికి కేంద్రంగా మారింది. ఇ20గా విక్రయిస్తున్న పెట్రోల్‌లో నిజంగానే 30, 35 లేదా 40 శాతం వరకు ఇథనాల్ కలుస్తోందా? లేక పరీక్షా విధానంలోనే లోపం ఉందా?ఈ ప్రశ్నకు రాజకీయ నినాదాలతో కాదు,శాస్త్రీయ ఆధారాలతో సమాధానంరావాలి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నవంబర్ 7న చేసిన ఇ20 కాస్తా 420 అయిందనే వ్యాఖ్య దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. పెట్రోల్‌లో అనుమతించిన పరిమితికి మించి ఇథనాల్ కలపడం ద్వారా ప్రజల వాహనాల నుంచి పెట్రోల్‌ను తీసేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ విమర్శగా కొట్టిపారేయలేని అంశం. అదే సమయంలో,ఆరోపణలను విచారణ పూర్తికాకముందే వాస్తవాలుగా ప్రకటించడం కూడా సరైంది కాదు. వివాదానికి మూలం కర్ణాటకలో నిర్వహించిన పెట్రోల్ నమూనాల పరీక్షలు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపూర్, బెంగళూరు రూరల్, రామనగర్, మంగళూరు, తుమకూరు జిల్లాల్లో సేకరించిన 14 నమూనాల్లో 11 నమూనాల్లో 20 శాతం కంటే అధికంగా ఇథనాల్ ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కొన్ని నివేదికల ప్రకారం ఐఒసిఎల్ నమూనాల్లో 31.2 శాతం, హెచ్‌పిసిఎల్ నమూనాల్లో 30.5 శాతం ఇథనాల్ నమోదైంది. బిపిసిఎల్, నయారా ఎనర్జీ, షెల్‌కు సంబంధించిన నమూనాలు కూడా పరీక్షల్లో భాగ



యి. తాము బిఐసి నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగానే ఇ20 పెట్రోల్ సరఫరా చేస్తున్నామని ప్రకటించాయి. కర్ణాటక ప్రభుత్వం అనుసరించిన నమూనా సేకరణ, పరీక్షా విధానం అధికారిక రిఫరీ పద్ధతికి అనుగుణంగా లేదని ప్రశ్నించాయి. పూర్తి శాంప్లింగ్ రికార్డులు, ఔట్‌లెట్ వారీ వివరాలు, పరీక్షా పద్ధతి, కౌంటర్ నమూనాలు అందిస్తే స్వతంత్ర ధృవీకరణకు సిద్ధమని తెలిపాయి. ఇదే ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం. ఒకవైపు ఎన్ఎబిఎల్ గుర్తింపు పొందిన ప్రయోగశాల పరీక్షల ఆధారంగా వచ్చిన ఆరోపణలు, మరోవైపు దేశంలోని ప్రధాన ప్రభుత్వ రంగ చమురు సంస్థల స్పష్టమైన ఖండన ఉన్నాయి. ఈ పరి స్థితిలో ప్రజలు ఎవరిని నమ్మాలి? రెండు పక్షాలు తమ తమ ల్యాబ్‌ల ఫలితాలను చూపించడం కంటే, పరస్పరం అంగీకరించిన స్వతంత్ర శాస్త్రీయ సంస్థతో మళ్లీ పరీక్షలు నిర్వహించడమే ఉత్తమ మార్గం. ఇ20 విధానం వెనుక ఉన్న లక్ష్యాలను కూడా విస్మరించరాదు. ముడిచమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం,విదేశీ మారకవ్యయాన్ని తగ్గించడం, కాలుష్య నియంత్రణ, రైతులకు ఇథనాల్ ఉత్పత్తి ద్వారా అదనపు ఆదాయం కల్పించడం వంటి ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. అయితే విధానం లక్ష్యం మంచిదని చెప్పడం మాత్రమే సరిపోదు, అమలు కూడా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. అనుమతించిన పరిమితిని మించి ఇథనాల్‌ఉంటే దాని ప్రభావం ఏమిటన్నది వినియోగదారుడి ప్రధాన ప్రశ్న. పాత వాహనాలపై ప్రభావం ఉంటుందా? మైలేజీ తగ్గుతుందా? ఇంధన వ్యవస్థలోని కొన్ని భాగాల మన్నికపై ప్రభావం పడుతుందా? వాహన తయారీదారుల వారంటీ పరిస్థితి ఏమిటి? ఈ అంశాలపై ప్రభుత్వం,చమురు సంస్థలు, వాహన తయారీదారులు స్పష్టమైన సమాచారాన్ని అందించాలి. దేశవ్యాప్తంగా శాస్త్రీయ పద్ధతిలో విస్తృత నమూనాల సేకరణ జరగాలి. స్వతంత్ర సంస్థల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను బహిరంగ పరచాలి.ప్రతి పెట్రోల్ బంకులో ఇథనాల్ మిశ్రమానికి సంబంధించిన స్పష్టమైన సమాచారాన్ని వినియోగదారుడికి అందించే విధానాన్ని కూడా పరిశీలించాలి.

దేశవ్యాప్తంగా కమ్ముకొస్తున్న కరవు!

బొల్లిముంత సాంబశివరావు

నవంబర్ 2026 నాటికి ఎల్‌నినో ప్రభావంవల్ల భారతదేశంలో రుతుపవనాలు అత్యంత అస్థిరంగా, దారుణంగా మారుతున్నాయని వర్షపాత గణాంకాలు తెలియజేస్తున్నాయి. దేశంలోని వర్షాధార వ్యవసాయంపై తీవ్రప్రభావం చూపుతున్నది. దీనికితోడు కేంద్ర,రాష్ట్రాల ప్రభుత్వ విధానాలు కరువు విస్తరణను పెంచుతూ ఉంది. ఐఐటి గాంధీనగర్ ఇండియా డ్రౌట్ మానిటర్ తాజా గణాంకాల ప్రకారం దేశంలోని సుమారు 49.6శాతం (దాదాపుసగం)భూభాగం ప్రస్తుతం కరవుపరిస్థితుల్లో ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ దక్షిణ భారతదేశంలో కరవు తీవ్రత అత్యధికంగా ఉంది. మహారాష్ట్రంలో 82.4 శాతం కరవు ప్రభావానికి గురైంది. మహారాష్ట్రంలో 265 తాలూకాలు, కర్ణాటకలో 217 తాలూకాలను ఇప్పటికే అధికారికంగా ప్రభుత్వాలు కరవును ప్రకటించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సీజన్‌కుగాను 412 మండలాలను కరవు మండ

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు

ఈసి కసరత్తు

డిసెంబరు ఆఖరిన లేదా జనవరిలో నోటిఫికేషన్



న్యూఢిల్లీ, నవంబరు 9: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తును ముమ్మరం చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను రానున్న డిసెంబరు చివరి వారంలోకానీ వచ్చే ఏడాది జనవరిలోకానీ ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రకటనకు ముందు, ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఈసీ పూర్తిస్థాయి బెంచ్ పర్యటించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లతో కూడిన ఈ పూర్తిస్థాయి బెంచ్, నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో తమ పర్యటనలను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ పర్యటనల సందర్భంగా రాష్ట్రాల క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎన్నికల సన్నద్ధతను సమీక్షిస్తారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో ఈసీ ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తుంది. ఇప్పటికే డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ (డీఈసీ) స్థాయి బృందాలు పలు రాష్ట్రాల్లో పర్యటించి సన్నాహక పనులను సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఈ బృందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక దఫా పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో డీఈసీ బృందం ఇంకా పర్యటించలేదు. నవంబర్ నెలాఖరు నాటికి ఈ బృందాలు తమ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నాయి. పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తోంది. అయితే, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. జనాభా పరంగా, భౌగోళికంగా పెద్దదైన ఉత్తరప్రదేశ్‌లో మాత్రం బహుళ దశల్లో ఎన్నికలు నిర్వహించే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రాల్లో పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అధికారుల అభిప్రాయాలను సమగ్రంగా విశ్లేషించిన తర్వాత, షెడ్యూల్ పై ఈసీ తుది నిర్ణయం తీసుకోనున్నది.

పార్లమెంట్ ప్రోరోగ్‌లో జాప్యం!

- 88 రోజుల కిందటే ముగిసిన వర్షాకాల సమావేశాలు
- సభలను అధికారికంగా ముగించని కేంద్రం
- డీలిమిటేషన్ బిల్లు కోసమేనని ప్రచారం
- పార్లమెంట్ చరిత్రలోనే అరుదైన రికార్డు!
- స్వల్ప నోటీసుతో మళ్లీ సమావేశాలు
- అంచనాలు వేస్తున్న విశ్లేషకులు



న్యూఢిల్లీ, నవంబరు 9: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసి 88 రోజులు గడిచినా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సభలను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించడం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది పార్లమెంట్ చరిత్రలోనే ఓ కొత్త రికార్డు. ఆగస్టు 13, 2026న లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, సోమవారం నాటికి కూడా రాష్ట్రపతి వాటిని అధికారికంగా ముగించలేదు (ప్రోరోగ్ చేయలేదు). సాధారణంగా సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాక, రాష్ట్రపతి సభలను ప్రోరోగ్ చేస్తారు. కానీ అలా చేయకపోవడం వల్ల, కేవలం రెండు రోజుల స్వల్ప నోటీసుతో ప్రభుత్వం ఎప్పుడైనా సభలను తిరిగి సమావేశపరచవచ్చు. అదే కొత్త సెషన్ ప్రారంభించాలంటే కనీసం 14 రోజుల నోటీసు అవసరం. ఈ సౌలభ్యం కోసమే కేంద్రం సమావేశాలను అధికారికంగా ముగించలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన రాజ్యాంగ సవరణను ఆమోదింపజేసుకోవడానికే కేంద్రం ఈ వ్యూహాన్ని అనుసరిస్తోందని తెలుస్తోంది.

లోక్‌సభ స్థానాలు పెంచేందుకు...

లోక్‌సభ స్థానాలను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచే డీలిమిటేషన్ ప్రక్రియతో ఈ బిల్లు ముడిపడి ఉంది. ఇదే తరహా రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సెషన్ ప్రత్యేక సమావేశంలో లోక్‌సభలో తగినంత మెజారిటీ లభించక విఫలమైంది. గతంలో 2008లో 87 రోజులపాటు సభలను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించడమే ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది. సభలను ప్రోరోగ్ చేయడానికి రాజ్యాంగంలో నిర్దిష్ట కాలపరిమితి ఏదీ లేదు, ఇది నిబంధనల ఉల్లంఘన కాదు. అయితే, సభలను తిరిగి సమావేశపరిచే విషయంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ప్రస్తుత సెషన్‌లోనే సమావేశాలను పొడిగించాలంటే కనీసం రెండు రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది, లేదంటే కొత్త సెషన్ కోసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి వస్తుంది. ఒకసారి సభలు నిరవధిక వాయిదా పడితే, ఆ సమావేశాలను రద్దు చేసేందుకు రాజ్యాంగం ప్రకారం ఎటువంటి నిర్దేశిత సమయ నియమం లేదు.

పార్లమెంటరీ చరిత్రలో అరుదైన రికార్డు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినప్పటికీ, అధికారికంగా ప్రోరోగ్ కాకుండా రికార్డు స్థాయిలో 88 రోజులుగా కొనసాగుతుండటం దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక అరుదైన రికార్డుగా నిలిచింది. ఆగస్టు 13న లోక్‌సభ, రాజ్యసభలు రెండూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ సమావేశాలను అధికారికంగా ముగించలేదు. దీంతో 2008 నాటి 87 రోజుల పాత రికార్డు బద్దలు అయ్యింది. సోమవారం ఉదయానికి పార్లమెంట్ ఉభయ సభలు ప్రోరోగ్ కాకపోవడం ఈ రికార్డ్ నమోదైంది. వర్షాకాల సమావేశాలకు అధికారికంగా ముగింపు ప్రకటించకపోవడం వల్ల పార్లమెంట్‌ను తక్కువ వ్యవధిలోనే తిరిగి సమావేశపర్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు సంబంధించి రాజ్యాంగ సవరణను చేపట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇలా చేస్తోందని భావిస్తున్నారు. 131వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టి లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలని కేంద్ర సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో మహిళలకు 2029 నుంచి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలు చేసేలా కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లు అవసరమైన మెజారిటీని సాధించలేక విఫలమైంది. అందుకే మరోసారి ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి నెగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మద్దతు కోసం ఇప్పటికే విపక్షంలోని పలు పార్టీలు, డీఎంకే, ఎన్‌సీపీ(శరద్ పవార్) వర్గంతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఒకవేళ ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను పొడిగించినా లేదా ప్రత్యేక సెషన్‌ను ఏర్పాటు చేసినా కనీసం రెండు రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.

14 రోజుల ముందు నోటీసు

అదే కొత్తగా సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. ఏదైనా సభను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత ఎంత కాలంలోపు దానికి అధికారికంగా ముగింపు ప్రకటించాలో అనే విషయాన్ని రాజ్యాంగంలో పేర్కొనలేదు. ఏదైనా సభ సుదీర్ఘకాలం పాటు ప్రోరోగ్ అవ్వకుండా ఉన్నంత మాత్రాన, అది రాజ్యాంగపరంగా లేదా విధానపరంగా తప్పు అని కూడా అర్థం కాదు. భారత పార్లమెంట్ చరిత్రలో ఇరు సభలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత కూడా సమావేశాలను దీర్ఘకాలం పాటు ప్రోరోగ్ చేయకుండా ఉంచిన సందర్భాలు చాలా ఉన్నాయి. సభ నిరవధికంగా పడినప్పటికీ 2008లో 87 రోజులు, 1987లో 76 రోజులు, 1989లో 54 రోజులు, 2006, 2013లో 49 రోజులు, 1963లో 41 రోజుల పాటు సమావేశాలు ప్రోరోగ్ కాలేదు. కాగా, 2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు లోక్‌సభ జులై 21, 22 తేదీలలో సమావేశమైంది. ఆ తర్వాత సభను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించారు. అక్టోబర్ 17న తిరిగి సమావేశమైన సభ, అక్టోబర్ 24న వాయిదా పడింది. తదుపరి సమావేశం డిసెంబర్ 10న మళ్లీ సభ ప్రారంభమైంది. అంటే ప్రోరోగ్ కాకుండా ఆ పార్లమెంట్ సమావేశాలు 87 రోజులు ఉన్నాయి. ఇప్పుడు ఆ రికార్డును పార్లమెంట్ వర్షాకాల సమావేశం బద్దలుకొట్టింది.

కమ్మేసిన కాలుష్య మేఘాలు

న్యూఢిల్లీ, నవంబరు 9: దీపావళి వేడుకల తర్వాత ఢిల్లీ విషవాయువులతో ఉక్కిరిబిక్కిరవుతోంది. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్ర స్థాయికి పడిపోయింది. ఈ పరిస్థితిపై అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. కాలుష్య తీవ్రతను ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా 25 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఆప్ చేసిందేమీ లేదని బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఆదివారం రాత్రి 11.05 గంటలకు ఢిల్లీ సగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 373గా నమోదైంది. అలీపూర్, బవానా, బురారీ, చాందినీ చౌక్, ముండ్కా, పంజాబీ బాగ్, రోహిణి, వివేక్ విహార్ ప్రాంతాల్లో ఏక్యూఐ 400 దాటింది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగ కారణంగా వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. కాలుష్యాన్ని కొలిచే పర్యవేక్షణ కేంద్రాలు కీలక సమయంలో డేటా చూపడం పోవడంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అనుమానాలు వ్యక్తం చేశారు. ఢిల్లీలోని 39 కేంద్రాల్లో 25 చోట్ల నవంబర్ 9 తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య పీఎం2.5 వివరాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. కాలుష్య గణాంకాలను ప్రభుత్వం కావాలనే దాచిపెడుతోందా పరికరాల సామర్థ్యాన్ని మించిన స్థాయిలో కాలుష్యం నమోదైందా అని ప్రశ్నించారు. డేటా కనిపించ కపోవడం వల్ల కాలుష్యం మాయమైపోదని వ్యాఖ్యానించారు.

ఆర్ఎస్ఎస్‌ను సమర్థించిన ఏకైక ముస్లిం!

నాగ్‌పూర్, నవంబరు 9: ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 100 సంవత్సరాలు కావస్తున్నా, స్వయంసేవకులే ఇప్పటికీ సంస్థకు అసలైన గుర్తింపు అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పునరుద్ధరించిన నాగ్‌పూర్ నాగరిక్ సహకారి బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోహన్ భగవత్ ప్రసంగించారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా, నిస్వార్థంగా సమాజం కోసం పనిచేసేవారే ప్రచారకులని మోహన్ భగవత్ తెలిపారు. ప్రచారకుడికి సంఘమే సర్వస్వమని స్పష్టం చేశారు.

తగ్గిన కేన్సర్ మందుల ధరలు

96.45% కుదించిన కేంద్రం ■ నేటినుంచే అమల్లోకి కొత్త ఎమ్మార్పీ



న్యూఢిల్లీ, నవంబరు 9: ప్రాణాంతక కేన్సర్ మహమ్మారితో పోరాడుతున్న రోగులకు ఆర్థిక భారాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్లో లభించే కీలక క్యాన్సర్ మందుల ధరలను భారీగా తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఔషధ విభాగం పరిధిలోని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ ఈ మేరకు ధరల తగ్గింపును అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో క్యాన్సర్ చికిత్సలో వినియోగించే 137 రకాల ఔషధాలకు చెందిన దాదాపు 1,031 ఫార్ములేషన్ల ధరలు గరిష్ఠంగా 96.45 శాతం వరకు తగ్గనున్నాయి. ఖరీదైన మందుల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద, మధ్యతరగతి రోగుల కుటుంబాలకు ఈ వెసులుబాటుతో పెద్ద ఎత్తున ఊరట లభించనుంది. క్యాన్సర్ మందుల ధరలపై గరిష్ఠంగా 96.45 శాతం వరకు కోత విధించారు. సవరించిన ఈ కొత్త ధరలు నేటినుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తాయి. మెడికల్ షాపులు, ఆసుపత్రులు తప్పనిసరిగా ప్యాకెట్‌పై ముద్రించిన సవరించిన గరిష్ట చిల్లర ధర ప్రకారమే విక్రయించాలి. క్యాన్సర్ రోగులు మరియు వారి బంధువులు మందులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్‌పై ఉన్న నూతన ఎంఆర్‌పీని క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. సవరించిన ధరల జాబితా మరియు పూర్తి వివరాల కోసం ఎన్‌పిపిఎ అధికారిక వెబ్‌సైట్ ఎన్‌పిపిఎడాట్‌జివో విడాట ్ఇన్‌ను సందర్శించవచ్చు.

నా పుస్తకం-నా వ్యక్తిగతం

ఆత్మకథ గ్లింప్స్ విడుదల చేసిన సోనియా గాంధీ



న్యూఢిల్లీ, నవంబరు 9: తన ఆత్మకథ బిలాంగింగ్ ఏ జర్నీ ఆఫ్ లవ్ పై కాంగ్రెస్ అగ్రనేత, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పుస్తకం ఎలాంటి రాజకీయ ఉద్దేశాలతో రాసింది కాదని, తన కుటుంబం, జీవిత విశేషాలను పాఠకులతో పంచుకునే పూర్తిగా వ్యక్తిగత కథనమని ఆమె స్పష్టం చేశారు. ఈ పుస్తకానికి సంబంధించి ఆమె ఆదివారం ప్రముఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తద్వారా ఆ పోస్ట్‌లో తన దివంగత భర్త, భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని గుర్తుచేసుకుంటూ, ఆయన ఎంతో అందమైన, సౌమ్యమైన వ్యక్తి అని పేర్కొన్నారు. అంతకుముందు గురువారం నాడు ఇన్‌స్టాగ్రామ్‌లోకి కూడా ప్రవేశించిన సోనియా, ఈ పుస్తకాన్ని "ప్రేమ, కర్తవ్యం, నష్టం, ఒక ఆత్మీయ స్థానాన్ని వెతుక్కునే ప్రయాణం"గా అభివర్ణించారు. మొత్తం 544 పేజీలతో కూడిన ఈ జ్ఞాపకాల సమాహారం నవంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లోకి రానుంది. గతంలో ప్రచురణకర్తలతో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగిపోవడంతో, భారత్‌లో దీనిని ప్రముఖ ప్రచురణ సంస్థ హార్పర్‌కాలిన్స్ ఇండియా విడుదల చేస్తోంది. ఈ పుస్తకం రాయడానికి గల కారణాన్ని సోనియా గాంధీ వివరిస్తూ ఇది రాజకీయ పుస్తకం కాదు, నా వ్యక్తిగత అంతరంగ ఆవిష్కరణ. నా కుటుంబం గురించి ఇప్పటివరకు ఎంతో మంది రాశారు. కానీ వారు ఎవరు, వారి ఆశయాలు, పోరాటాలు, వారిలోని మానవ సహజమైన లోటుపాట్లు ఏమిటనే అంశాలపై సమగ్ర అవగాహనతో రాసినవి చాలా తక్కువ. నాకు బాగా తెలిసి, నేను అమితంగా ప్రేమించిన వ్యక్తులుగా వారిని నిజాయతీగా ఆవిష్కరించాలనే ఉద్దేశంతోనే ఈ పుస్తకం రాశానని వివరించారు. అయితే, ఈ పుస్తకం విడుదల ప్రకటన దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పుస్తకంలో వ్యక్తిగత అంశాల కంటే రాజకీయ విమర్శలే ఎక్కువగా ఉన్నాయని భారతీయ జనతా పార్టీ ఆరోపించింది. పుస్తక విడుదలకు ముందు ది హిందూ పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సోనియా చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం తీవ్రమైంది. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తోందని, ప్రధాన మీడియాను తన అదుపులో ఉంచుకుంటోందని, రాజకీయ లబ్ధి కోసం మతాన్ని వాడుకుంటోందని సోనియా గాంధీ ఆ ఇంటర్వ్యూలో ఆరోపించారు. 1975 నాటి ఎమర్జెన్సీ విధింపు వెనుక రాజ్యాంగబద్ధమైన కారణాలు ఉన్నా యంటూ ఆమె సమర్థించారు. దీనిపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇందిరా గాంధీ పాలనలోని చీకటి రోజులను సమర్థించుకోవడానికే సోనియా ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఎదురుదాడికి దిగింది.

సంక్షిప్త వార్తలు

వాసీనా ఎప్పటికీ నేరస్థురాలే : బంగ్లాదేశ్



షేక్ హసీనా

ఢాకా, నవంబరు 9: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న విషయంపై బంగ్లాదేశ్ న్యాయ శాఖ మంత్రి అసదుజ్జమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దోషిగా తేలిన హసీనాను భారత్ నుంచి స్వదేశానికి తిరిగి తీసుకురావడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే న్యూఢిల్లీకి పలుమార్లు విజ్ఞప్తి లేఖలు పంపినట్లు తెలిపారు. అయినా ఎటువంటి సమాధానం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నా దృష్టిలో హసీనా ఒక నేరస్థురాలు. మా ట్రైబ్యునల్ ఆమెను దోషిగా నిర్ధారించింది. ఒకవేళ వారు ఆమెను మాకు అప్పగిస్తే ఎటువంటి భావోద్వేగాలకు తావులేకుండా ఈ విషయాన్ని చట్టప్రకారం పరిష్కరిస్తాం. నిబంధనలు ఉల్లం ఘించేలా మేం ఏమీ చేయబోం' అని అసదుజ్జమాన్ పేర్కొన్నారు.

స్వదేశానికి వెళ్లేందుకు షేక్ వాసీనా సన్నాహాలు

న్యూఢిల్లీ, నవంబరు 9: భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు చేరుకోవాలన్న లక్ష్యంతో కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయానికి ఆమె తరఫు న్యాయవాదులు లేఖ రాశారు. అయితే హసీనాను స్వదేశానికి రప్పించేందుకు పాస్‌పోర్టు అవసరం లేదని, భారత్ ఆమెను అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం పట్టుబడుతోంది. దీంతో ఈ వ్యవహారం మరోసారి ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చకు దారితీసింది.

అద్వానీ వందో పుట్టిన రోజున బీజేపీ పూజలు

న్యూఢిల్లీ, నవంబరు 9: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్.కె. అద్వానీ 100వ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సహా పలువురు నేతలు ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో హోమం చేపట్టారు. అద్వానీ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అద్వానీకి నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసంఘ్ నుంచి బీజేపీ వరకు పార్టీ విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. జాతీయవాద భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, రామజన్మభూమి ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చడంలో అద్వానీ కృషి మరువలేనిదని కొనియాడారు.

ఎన్‌క్లోజర్ పునాది తవ్వి తప్పించుకున్న పులి



కోల్‌కత్తా, నవంబరు 9: పశ్చిమ బెంగాల్‌లోని బుక్సా టైగర్ రిజర్వ్‌లో ఓ విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్ పునాది కింద సొరంగం తవ్వి మూడేళ్ల ఆడపులి చాకచక్యంగా తప్పించుకుంది. అసోంనుంచి తిరిగి తీసుకొచ్చిన కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడంతో అటవీ అధికారులు విస్మయానికి గురయ్యారు. బెంగాల్‌లో పులుల సంఖ్యను పెంచే ప్రాజెక్టులో భాగంగా బీహార్‌లోని వాల్మీకి టైగర్ రిజర్వ్ నుంచి టీ138 అనే ఆడపులిని తీసుకొచ్చారు. అక్టోబర్ 2న బుక్సాలోని 25వ మైలు వద్ద ఉన్న 2.2 హెక్టార్ల ఎన్‌క్లోజర్‌లో దీనిని విడిచిపెట్టగా, అక్టోబర్ 4నే బయటపడి సంకోష్ నది దాటి అసోంలోని రైమోనా ప్రాంతానికి వెళ్లిపోయింది.

ఇరాన్‌పై దాడులకు బ్రేక్!

వెనక్కి తగ్గిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్, నవంబరు 9: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింత వెనక్కి తగ్గుతున్నట్టు కనిపిస్తోంది. ఇరాన్‌పై మళ్లీ దాడులు పునఃప్రారంభించకపోవచ్చని తాజాగా చెప్పారు. మధ్యంతర ఎన్నికల్లో ఓటమికి దారితీసిన పలు అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం యుద్ధాన్ని ముగించేలా ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. అదే సమయంలో యుద్ధం చేసే ఆప్షన్‌ను కూడా తన వద్ద ఉంచుకున్నట్టు పెర్కొన్నారు.

చర్చలు విఫలమైతే...

'ఇరాన్ అణు కార్యక్రమం విషయంలో ఒప్పందం కుదిరి, హార్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే.. మళ్లీ ఆ దేశంపై దాడులు జరిగే అవకాశం చాలా తక్కువ. అదే సమయంలో చర్చలు విఫలమైతే మళ్లీ దాడులకు వెనకాడబోం. మా వద్ద మూడు విమాన వాహక నౌకలు సిద్ధంగా ఉన్నాయి. గంటల వ్యవధిలో ఇరాన్‌లో 30 వంతెనలను ధ్వంసం చేయగలం' అని ట్రంప్ వెల్లడించారు. ఇటీవల ఇరాన్, అమెరికా మధ్య శాంతి ఒప్పందం కోసం పలు ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రయత్నాలు జరుగుతున్నప్పుడే అమెరికా దాడులు చేసింది. ఇటీవల మధ్యంతర ఎన్నికల్లో యుఎస్ కాంగ్రెస్‌లో డెమోక్రాట్లకే ఆధిపత్యం లభించింది. వారు ఉభయసభల్లో పట్టు సాధించడంతో ఈ యుద్ధాన్ని త్వరగా ముగించాలని రాజకీయంగా ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందన వచ్చింది.

ఖతార్ మధ్యవర్తిత్వం

ఇరాన్ యుద్ధం ముగించడంలో ఖతార్ మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఘర్షణల ముగింపులో కొత్త ప్రతిపాదనలు చేస్తోంది. ఇలాంటి సమయంలో ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ థానీతో సోమవారం ట్రంప్ భేటీ కానున్నారు.

వలస విధానంతోనే ముప్పు

ఓటమితో ట్రంప్ నిర్వేదం

వాషింగ్టన్, నవంబరు 9: మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా తాను ఎంతో కఠినంగా వ్యవహరించిన వలస విధానంపై ఆయన మెత్తబడ్డారు. తన విధానం కొంత కఠినంగా ఉందేమో అని అంగీకరించారు. సీబీఎస్ ఛానల్‌కు చెందిన 60 మినిట్స్ కార్యక్రమానికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ట్రంప్ పలు కీలక అంశాలపై మనసు విప్పారు. డెమోక్రాట్లు కాంగ్రెస్‌లోని రెండు సభల్లో ఆధిక్యం సాధించిన కొన్ని రోజులకే ఈ ఇంటర్వ్యూ ప్రసారం కావడం గమనార్హం. తన వలస విధానంలో కొన్ని అంశాలు ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి నష్టం కలిగించాయని ట్రంప్ అంగీకరించారు. సరిహద్దు భద్రత, నేరస్థులను దేశం నుంచి పంపించే విషయంలో ప్రజలు తనకు ఎ ప్లస్ గ్రేడ్ ఇచ్చారని చెబుతూనే, ఏళ్లుగా అమెరికాలో ఉంటూ, ఉద్యోగాలు చేసుకుంటున్న వారిని వెనక్కి పంపించడం కొంత వ్యతిరేకతకు కారణమైందని అంగీకరించారు. ఈ విధానం కొంతకఠినంగా ఉందేమోనని నేను భావిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. తీవ్రమైన నేరాలకు పాల్పడని వారి విషయంలో డెమోక్రాట్లతో కలిసి ఒక రాజీ ఫార్ములాకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకోసం డెమోక్రాట్లను ఆరు నెలల పాటు తాను విమర్శించకుండా ఉంటానని సరదాగా వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో యుద్ధం కూడా మధ్యంతర ఎన్నికల ఓటమికి ఒక కారణమని అభిప్రాయపడిన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తో ఏకీభవిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారకుండా అడ్డుకోవాల్సిన చారిత్రక అవసరం ఉందని, దీర్ఘకాలంలో ఈ నిర్ణయాన్ని అందరూ ప్రశంసిస్తారని ఆయన తన చర్యను సమర్థించుకున్నారు. ఇరాన్ అణు సామగ్రిని పూర్తిగా నిర్వీర్యం చేశామని, హార్ముజ్ జలసంధిని తెరిచే ఉంచామని స్పష్టం చేశారు. రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ఒక ఒప్పందం దగ్గర్లో ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అప్పట్లో తాను అధ్యక్షుడిగా ఉండుంటే ఈ యుద్ధమే వచ్

ఇక జిల్లాల్లోనూ మెరుగైన వైద్యం

1,616 మంది స్పెషలిస్టుల నియామకం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



సోమవారం సచివాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కేర్ పునర్వ్య వస్థీకరణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు వారి జిల్లాల్లోనే అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ఈ హాస్పిటళ్లలో మౌలిక సదుపాయాలు, స్పెషలిస్ట్ వైద్య సేవలు, అవసరమైన వైద్య సిబ్బంది, డయాగ్నస్టిక్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకం దరీ హెల్త్‌కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పునర్వ్య వస్థీకరణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వ హించారు. ప్రతి జిల్లాలో డీసీహెచ్ పునర్వ్యవస్థీకరణపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఏఎస్‌సిఐ) రూపొందించిన అధ్యయన నివేదికలోని ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థ బలోపేతానికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఇక జిల్లాల్లోనే అన్నిరకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్ యమని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియా మకాలతోపాటు అవసరమైన నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టినట్లు తెలిపారు. 30 పడ కలు, 50 పడకలు, 100 పడకలు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ఆసుపత్రులకు వాటి స్థాయికి అను గుణంగా వైద్యసేవల పరిధిని నిర్ణయించాలని మంత్రి సూచించారు. సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు అందుబాటులో ఉండాల్సిన స్పెషలిస్ట్ వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, డయాగ్నస్టిక్ సదు పాయాలు కల్పించాలని ఆదేశించారు. ఐపీహెచ్ఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. చిన్నచిన్న వైద్య సమస్య లకూ హైదరాబాద్‌కు వెళ్లే పరిస్థితి తగ్గించడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహా పేర్కొన్నారు. ఈ సమా వేశంలో ప్రముఖ అంకాలజిస్ట్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, జీఏడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేశ్‌దత్ ఎక్కా, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ, ఆస్కి డైరెక్టర్ డాక్టర్ సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఏర్పాటు చేసిన రైతు సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

కీలక అభివృద్ధి కేంద్రంగా కొడంగల్

లగచర్ల రైతు సభలో డి.సిఎం భట్టి

దుద్యాల్, నవంబరు 9, ప్రభాతవార్త: కొడంగల్‌ను పారిశ్రామిక, విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే కీలక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ నుంచి కొడంగల్‌కు గంటలో చేరుకునేలా రహదారుల అభివృద్ధితో పాటు వేల ఎకరాల్లో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు, ఇంట ిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతో విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, మక్తల్- నారాయణ పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కొడంగల్ ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్ యమని పేర్కొన్నారు.

కొడంగల్ అభివృద్ధి చరిత్రలో నూతన అధ్యాయం: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో మూడు రోజులపాటు పర్యటించి వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం అభినందనీయమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త కార్యక్రమాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. తెలంగాణను పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక భరోసా, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఐక్యంగా పనిచేసి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు.

రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి పెద్దపీట: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులకు పెట్టుబడి భరోసా, పంటల కొనుగోలు, బోనస్, పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.78 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 14 ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. రాబోయే కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులను ముందుగానే సన్నద్ధం చేస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు.

పారిశ్రామిక పార్కులతో యువతకు ఉపాధి అవకాశాలు: మంత్రి శ్రీధర్ బాబు

కొడంగల్ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్ యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నియోజకవర్గంలో మూడు ప్రధాన పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, రూ.100 కోట్లతో నారీ అపారెల్ పార్కుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. త్రై పార్క్, ఎర్లపల్లిలో రైస్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భూసేకరణకు రూ.505 కోట్లు కేటాయించి వికారాబాద్ నుంచి నారాయణపేట వరకు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. పెట్టుబడులను ఆకర్షించి స్థానికంగా ఉపాధి కల్పించడం ద్వారా వలసలను నివారించి కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

బీమా కవరేజ్‌లో నాలుగు అంచెల విధానం

కవరేజ్ ఎంపికపై వాహనదారునికి స్పష్టత

బీమా సుగమ్ డిజిటల్ వేదికతో అనుసంధానం

డిసెంబరు 15 నుండి అమల్లోకి నూతన పాలసీ

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: వాహన బీమా విధానంలో ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డవలప్మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏఐ) కీలక మార్పులు తీసుకొచ్చింది. డిసెంబరు 15 నుంచి నాలుగంచెల మోటారు బీమా విధానం అమల్లోకి రానుంది. థర్డ్‌పార్టీ లయబిలిటీ, ప్రయాణికులు-పిలియన్ రైడర్ల బీమా, వ్యక్తిగత ప్రమాద బీమా, సొంత వాహన నష్టం-చోరీ కవరేజీలుగా పాలసీని విభజించారు. ప్రతి కవరేజీకి సంబంధించిన ప్రీమియం వివరాలను విడిగా వెల్లడించాలి. వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా కవరేజీలను ఎంచుకోవచ్చు. కొత్త విధానాన్ని బీమా సుగమ్ డిజిటల్ వేదికతోనూ అనుసంధానించనున్నారు. కారు, ద్విచక్ర వాహన యజమానులకు బీమా విషయంలో మరింత వెసులుబాటు కలగనుంది. ఇప్పటివరకు ఒకే పాలసీలో వివిధ రకాల బీమా కవరేజీలు కలిపి ఉండటంతో ఏ రక్షణకు ఎంత ప్రీమియం చెల్లిస్తున్నారో చాలామందికి స్పష్టత ఉండేది కాదు. ఈ సమస్యకు పరిష్కారంగా భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ మోటారు బీమా విధానంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇకపై వాహనదారులు తమ అవసరాలు, ఆర్థిక స్థితిగతులు, ఆసక్తికి అనుగుణంగా బీమా కవరేజీలను ఎంపిక చేసుకునేలా నాలుగంచెల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు బీమా సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కొత్త విధానంలో మోటారు వాహన బీమాను నాలుగు విభాగాలుగా వర్గీకరించారు. వీటిలో థర్డ్‌పార్టీ లయబిలిటీ బీమా. వాహనం కారణంగా ఇతరులకు గాయాలైనా, మరణించినా లేదా ఇతరుల వాహనాలు, ఆస్తులకు నష్టం వాటిల్లినా ఈ బీమా ద్వారా పరిహారం చెల్లిస్తారు. మోటారు వాహన చట్టం ప్రకారం రహదారిపై తిరిగే వాహనాలకు థర్డ్‌పార్టీ బీమా తప్పనిసరి. రెండోది ప్రయాణికులు, పిలియన్ రైడర్ల బీమా. కారులో ప్రయాణించే వ్యక్తులు, ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చునే వారికి ప్రమాదాల సమయంలో ఆర్థిక రక్షణ కల్పించేందుకు ఈ కవరేజీ ఉపయోగపడుతుంది. ఇది ఐచ్ఛికం. అవసరాన్ని బట్టి అదనపు ప్రీమియం చెల్లించి పొందవచ్చు. మూడో విభాగం వ్యక్తిగత ప్రమాద బీమా. వాహన యజమానికి ఈ రక్షణ తప్పనిసరి. ప్రమాదం కారణంగా యజమాని మరణించినా లేదా శాశ్వత వైకల్యం సంభవించినా నిబంధనల ప్రకారం పరిహారం అందుతుంది. ప్రయాణికులు, వెనుక కూర్చునే వారు, యజమాని కాని ఇతర డ్రైవర్లకు కూడా వ్యక్తిగత ప్రమాద బీమా రక్షణ కావాలంటే అదనంగా కవరేజీ తీసుకోవచ్చు. నాలుగోది ఓన్ డ్యామేజ్, చోరీ బీమా. ప్రమాదాలు, అగ్నిప్రమాదం, ప్రకృతి వైపరీత్యాలు వంటి పాలసీ పరిధిలోకి వచ్చే కారణాలతో సొంత కారు లేదా బైక్ దెబ్బతిన్నప్పుడు ఈ కవరేజీ ద్వారా పరిహారం పొందవచ్చు. వాహనం చోరీకి గురైనా నిబంధనల ప్రకారం బీమా ప్రయోజనం లభిస్తుంది. ఈ కవరేజీ కూడా వాహనదారుడి ఎంపికపై ఆధారపడి ఉంటుంది. ప్రతి కవరేజీకి విడిగా ప్రీమియం వివరాలు కొత్త విధానంలో పారదర్శకతకు ఐఆర్‌డీఏఐ ప్రాధాన్యం ఇచ్చింది. పాలసీ తీసుకునే సమయంలో ఏ విభాగానికి ఎంత ప్రీమియం చెల్లించాలో బీమా సంస్థలు విడివిడిగా వెల్లడించాలి. పాలసీ పత్రంలోనూ ప్రతి కవరేజీకి సంబంధించిన వివరాలను స్పష్టంగా పొందుపరచాలి. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో లేదా నేరుగా బీమా తీసుకున్నా వినియోగదారుడికి కస్టమర్ ఆప్షన్ ఫారం, కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ అందించాలి. వీటి ద్వారా తనకు అవసరమైన బీమా రక్షణలను ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే థర్డ్‌పార్టీ బీమా తీసుకున్న వాహనదారులు కొత్తగా మొత్తం పాలసీని రద్దు చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రయాణికులు, పిలియన్ రైడర్లకు సంబంధించిన లయబిలిటీ కవరేజీని అదనపు ప్రీమియం చెల్లించి ప్రస్తుత బీమా సంస్థ నుంచే జోడించుకోవచ్చు. అలాగే నాలుగంచెల బీమా విధానాన్ని డిసెంబరు 15 నుంచే బీమా సుగమ్ డిజిటల్ వేదికతో అనుసంధానించాలని ఐఆర్‌డీఏఐ బీమా సంస్థలను ఆదేశించింది. ఈ మార్పులతో వాహనదారులకు తమకు అవసరమైన రక్షణను ఎంచుకునే స్వేచ్ఛ లభించడంతోపాటు, ప్రీమియం చెల్లింపుల్లో స్పష్టత పెరగనుంది.

డిసెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో అంతర్జాతీయ వాతావరణ సదస్సు

హైదరాబాద్,నవంబరు9,ప్రభాతవార్త:డిసెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో అంతర్జాతీయ వాతావరణ సదస్సు జరగనుంది. సదస్సు ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. కాగా, సదస్సుకు రావాలని హాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులకూ ప్రభుత్వం ఆహ్వానం పంపే యోచనలో ఉంది.

భారత్‌లో అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశీయురాలి అరెస్టు

డ్రగ్స్ స్మగ్లింగ్, వ్యభిచారం చేస్తున్నట్లు ఆరోపణలు

ఆమె ప్రియుడిని కూడా అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: కరోనా సమయంలో భారత్‌కు పొట్టకూటి కోసం వచ్చి ఉద్యోగం లభించక పోవడంతో ఒక బ్రోకర్ మాటలు విని సెక్స్ వర్కర్‌గా మారి, ఆనక డ్రగ్స్ స్మగ్లర్ అవతారం ఎత్తి ఐదేళ్లుగా దర్జాగా దందా సాగిస్తున్న ఓ బంగ్లాదేశీయురాలిని ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈమెతో పాటు హైదరాబాద్‌కు చెందిన ప్రియుడిని కూడా అరెస్టు చేసి, కొంతమేర సింథటిక్ డ్రగ్స్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా సోమవారం మీడియాకు వెల్లడించారు. బంగ్లాదేశకు చెందిన 27 ఏళ్ల ఓ యువతి 2021లో కరోనా సమయంలో పొట్టకూటి కోసం భారత్‌కు వచ్చింది. ఇక్కడ సరైన ఉద్యోగం లభించక పోవడంతో యుపికి చెందిన ఓ బ్రోకర్ మాటలు నమ్మి సెక్స్ వర్కర్‌గా మారింది. మొదట కొంతకాలం అతను చెప్పిన వ్యక్తుల వద్దకు వెళ్లి సెక్స్ వర్కర్‌గా పనిచేసేది. ఈ క్ర మంలో చెన్నైకి చెందిన రాహుల్, హైదరాబాద్‌కు చెందిన జయ్, జెక్‌లు పరిచయం అయి మరికొందరు విటులను ఎంచుకుని వారితోనూ దం దాలు చేసింది. దీని తరువాత హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్యాంరావుతో పరిచయం కాగా ఇదికాస్త ప్రేమగా మారి ఇద్దరు సహ జీవనం సాగించారు. ఈ విషయం తెలిసి శ్యాంరావు భార్య భర్తతో దూరంగా వుంటోంది. ఓవైపు శ్యాంరావుతో బంగ్లా యువతి సహ జీవనం చేస్తూనే మరోవైపు విటులతో సెక్స్ వర్కర్‌గా పనిచేస్తోంది. ఇదే సమయంలో గోవాకు చెందిన ఆకాష్ అనే విటుడితో పరిచయమై డ్రగ్స్ దందా లో దిగింది. ఆకాష్ సింథటిక్ డ్రగ్స్ ఇస్తుండగా దానిని ఈ యువతి హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాలలోని తన కస్టమర్లకు అమ్ముతోంది. ఇలా ఈ యువతి ఓవైపు వ్యభిచారం మరోవైపు డ్రగ్స్ అమ్మకాలతో నెలకు రెండు లక్షల రూపాయల వరకు సంపాదిస్తోంది. శ్యాంరావుతో స హ జీవనం తరువాత తన పేరును భారత్‌కు చెందిన జియాగా మార్చుకుని తప్పుడు పత్రాలతో ఆధార్ కార్డు, పాన్ కార్డు సంపాదించి బ్యాంకు లో ఖాతా తెరిచి దందాలో సంపాదించిన నగదును అందులో దాచుకుంటోంది. కాగా ఈ యువతి గురించి సమాచారం అందుకున్న ఈగల్ పో లీసులు రాయదు ర్గం పరిధిలో ఆమె నివాసంపై ఆదివారం రాత్రి దాడిచేశారు. ఈ సందర్భంగా ఆ యువతితో పాటు ఆమెకు చెందిన నకిలీ ఆ ధార్, పాన్ కార్డు, వీటి సహాయంతో బ్యాంకులో తెరిచిన ఖాతా తాలూకు పాస్ పుస్తకం పట్టుబడింది. ఇదే సమయంలో ఆమెతో సహ జీవనం చేస్తున్న శ్యాంరావు పట్టుబడ్డారు. వీరి వద్ద కొంత సింథటిక్ డ్రగ్ పట్టుబడింది. వీరిద్దరిని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు.

బాధ్యులైన ఫెర్టిలిటీ సెంటర్ల చైర్మన్లు లేదా ఎండీలు విచారణకు రావాలి

అండ మార్పిడీ అక్రమ దందాలపై మహిళా కమిషన్ ఆగ్రహం

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: మహిళల అండాల దందాపై మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులైన ఫెర్టిలిటీ సెంటర్ల చైర్మన్లు లేదా ఎండీలు ఈనెల 13న మళ్లీ విచారణకు రావాలని మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. విచారణకు కింది స్థాయి సిబ్బందిని పంపడంపై మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, ఐదు ప్రముఖ ఫెర్టిలిటీ కేంద్రాలకు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ ఉదంతంపై మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి విస్తృత విచారణ చేపట్టింది. దీనికి సంబంధించిన వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదు ప్రముఖ ఫెర్టిలిటీ సెంటర్లకు మహిళా కమిషన్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. అండాల సేకరణలో చట్ట నిబంధనలు పాటించారా, బాధిత మహిళల ఆరోగ్య భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నార తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసుల మేరకు సంబంధిత ఐదు ఫెర్టిలిటీ కేంద్రాల నిర్వాహకులు కమిషన్ ఎదుట హాజరయ్యారు.

వాణిజ్య పన్నుల వసూళ్లలో సరికొత్త రికార్డు

ఏడు నెలల్లో రూ.52,110 కోట్ల ఆదాయం

గత యేడాదితో పోలిస్తే 22.16 శాతం వృద్ధి

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: రాష్ట్ర ఖజా నాకు వాణిజ్య పన్నుల శాఖ భారీ ఆదాయాన్ని సమకూర్చింది. జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యా క్స్ వసూళ్లలో గణనీయమైన వృద్ధి నమో దైంది. అక్టోబర్ నెలలోనే మొత్తం రూ.7,735 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది. గత ఏడాది ఇదే నెలలో వచ్చిన రూ.6,332 కోట్లతో పోలిస్తే 22.16 శాతం వృద్ధి నమోదైంది. గత నెలలో వచ్చిన మొత్తం ఆదాయంలో జీఎస్టీ ద్వారా రూ.4,590 కోట్లు, వ్యాట్ ద్వారా రూ.3,065 కోట్లు, ప్రొఫెషనల్ ట్యాక్స్ ద్వారా రూ.80 కోట్లు సమకూరాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే జీఎస్టీ ఆదాయం 17.27 శాతం, వ్యాట్ వసూళ్లు 30.87 శాతం పెరిగాయి. ప్రొఫెషనల్ ట్యాక్స్ ఆదాయం 5.26 శాతం వృద్ధి సాధించింది. ఇక ప్రస్తుత 2026-27 ఆర్థిక సంత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రాష్ట్రానికి జీఎస్టీ, వ్యాట్, ప్రొఫెషనల్ ట్యాక్స్ రూపంలో మొత్తం రూ. 52,110 కోట్ల ఆదాయం వచ్చిం ది. గత యేడాది ఇదే కా లంలో రూ. 44,598 కోట్లు మాత్రమే సమ కూరాయి. ఈసారి అదనంగా రూ.7,512 కోట్ల ఆదాయం రావడంతో 16.85 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడు నెలల కాలంలో జీఎస్టీ ద్వారా రూ.29,627 కోట్లు వసూల య్యాయి. గత ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.24,974 కోట్లతో పోలిస్తే 18.63 శాతం పెరుగుదల నమోదైంది. వ్యాట్ ఆదాయం రూ.19,049 కోట్ల నుంచి రూ.21,893 కోట్లకు చేరి 14.93 శాతం వృద్ధిని సాధించింది. ప్రొఫె షనల్ ట్యాక్స్ ఆదాయం రూ.590 కోట్లకు చేరిం ది. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జీఎస్టీ ద్వారా రూ.52,490 కోట్ల ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అక్టోబరు నాటికి రూ.29,627 కోట్లు వసూల య్యాయి. అంటే వార్షిక లక్ష్యంలో 56.44 శాతం సాధించినట్లయింది. అదేవిధంగా వ్యాట్, సేల్స్ ట్యాక్స్ ద్వారా రూ.38,106 కోట్ల వార్షిక లక్ష్యా నికిగానూ ఏడు నెలల్లో రూ.21,893 కోట్లు సమ కూరాయి. దీంతో 57.45 శాతం లక్ష్యాన్ని చేరు కున్నారు. వాణిజ్య పన్నులశాఖలో నమో దవుతు న్న ఆదాయవృద్ధి రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఊత మి స్తోంది. ఇదేస్థాయిలో పన్నులవసూళ్లు కొనసాగితే 2026-27 వార్షికబడ్జెట్ లక్ష్యాలను చేరుకునే అవ కాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కామారెడ్డి ఆపరేషన్ కవచ్..

వన్య ప్రాణుల వేటగాళ్ల ముఠా అరెస్టు

నాటు తుపాకులు, ఎయిర్‌గన్, వేట సామగ్రి, వాహనాలు స్వాధీనం



వన్యప్రాణులను వేటాడుతున్న వేటగాళ్ల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఎస్పి రాజేష్‌చంద్ర.

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: కామారెడ్డి జిల్లాలో వన్య ప్రాణులను వేటాడుతున్న వేటగాళ్లను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఆ పరేషన్ కవచ్‌లో భాగంగా వన్యప్రాణులను వేటాడుతున్న వేటగాళ్ల కోసం గత జూన్ నెల 24వ తేదీన చేబట్టిన ఆపరేషన్‌లో పట్టుబడిన ఐదు గురిని కస్టడీలోకి తీసుకుని విచారించగా మరో ముగ్గురు నేరగాళ్లు దొరికిపోయారు. దీంతో పాటు వీరి కుట్రలు రట్ట య్యాయి. పట్టుబడ్డ వారి వద్ద నుంచి నాటు తుపా కులతో పాటు ఎయిర్ గన్, వేట సామాగ్రి, వాహనాలు జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర సోమవారం మీడియాకు వెల్లడించారు. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వన్యప్రాణులను వేటా డుతున్న నేరగాళ్ల కోసం గత జూన్ నెల 24వ తేదీన నిర్వహించిన దాడుల్లో గాంధారీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొండి సడక్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో రెండు మోటార్ సైకిళ్లపై ఐదుగురు వ్యక్తులు అనుమా నాస్పదంగా వెళుతుండగా వారిని సోదా చేశారు. వారి వద్ద నాటు తుపా కులు, గన్‌పౌడర్, పొటా ష్, జంతువులను చంపేం దుకు వాడే ఇనుప చెర్రలు సహా వేట సామగ్రి పట్టు బడింది. వీరిని ఆ సమయం లో అరెస్టు చేసి రిమాండుకు తరలించి కస్టడీలోకి తీసుకుని విచారించగా మరిన్ని కుట్రలు వెలుగు చూడడంతోపాటు ఈ ముఠాలోని మరో ముగ్గురు పట్టుబడ్డారు. ఈ ముఠాలో మొదట గాం ధారి మండలం గండీపేట్ తాండకు చెందిన విస్లా వత్ అరుణ్, విస్లావత్ గోపిచంద్, ఆంగోత్ లక్ష్ మణ్, విస్లావత్ నాను, విస్లావత్ గణేష్‌లు పట్టుబడగా వీరిని విచారించిన తరువాత వెలుగు చూసిన సమాచారం సలావత్ చందర్, అంగోత్ ధర్మనాయక్, అస్లాం చావుస్‌లు పట్టు బడ్డారు. వీరివద్ద నుంచి ఐదునాటు తుపా కులు ఎయిర్‌గన్, మూడు ట్రిగ్గర్ మెకానిజం ఉపక రణాలు కొంతమేర వేట సామాగ్రి, ఇనుప చెర్రలు, పేలుళ్ల కోసం వాడే గన్ పౌడర్, పొటాష్ ఒక కారు మరో ద్విచక్ర వాహనం జప్తు చేశారు. జిల్లాలో వన్యప్రాణులను అడవి జంతువులను ఎవ రైనా వేటాడేందుకు యత్నిస్తే కఠినంగా వ్యవహ రిస్తామని ఎస్పి రాజేష్ చంద్ర ఈ సందర్భం గా హెచ్చరించారు. అరెస్టయిన నిందితులను రిమాం డుకు తరలించారు. వేటగాళ్లను పట్టుకున్న పోలీసులను ఎస్పి అభినందించారు.

డిపిఆర్ లేకుండానే టెండర్లా!

ఇది తుగ్లక్ పాలన కాకుంటే మరేంటి? కెటిఆర్

హైదరాబాద్,నవంబరు9,ప్రభాతవార్త:మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన తీరుతోపాటు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం కాకుండానే టెండర్లు పిలవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగ్ నిర్వహించారని, డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు బిడ్లను ఆహ్వానించారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలు, ప్రాజెక్టు సమగ్ర వివరాలు లేకుండా ఇంత భారీ ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకెళ్తారని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, నీటి సమస్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంటూ, ఇలాంటి సమయంలో సుందరీకరణ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. ప్రజల అవసరాలు, ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్తున్నారని ఆరోపించారు. "ప్రజలు లేకుండా పబ్లిక్ హియరింగ్.. డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు బిడ్లు పిలవడం.. ఇందులో విడ్డూరం ఏంటంటే, రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో ఖిసుందరీకరణఖి పేరుతో హడావుడి చేయడం. ఇది తుగ్లక్ ప్రభుత్వం కాకపోతే మరేం అనాలో అర్థం కావడం లేదు" అంటూ కేటీఆర్ తన ట్వీట్‌లో వ్యాఖ్యానించారు.

మూసీ నది పునరుజ్



సెనెగల్ తీరంలో పెనువిషాదం

వలసదారులతో వెళుతున్న పడవ మునిగి

21 మంది మృతి

డాకర్, నవంబరు 9: పశ్చిమ ఆఫ్రికా దేశం సెనెగల్ తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. వలసదారులతో యూరప్ దిశగా ప్రయాణిస్తున్న ఒక పడవ సముద్రంలో బోల్తా పడి మునిగిపోవడంతో కనీసం 21 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటనను సెనెగల్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదివారం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం సముద్రంలో గాలింపు, సహాయక చర్యలను ముమ్మరం చేసింది. శనివారం సాయంత్రం నాటికి ఒక వ్యక్తిని సహాయక సిబ్బంది సురక్షితంగా కాపాడారు. ప్రమాదం జరిగిన సమయంలో పడవలో మొత్తం ఎంతమంది ప్రయాణిస్తున్నారనే దానిపై సరైన స్పష్టత లేదు. దీంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ దుర్ఘటనపై సెనెగల్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రమాద బాధితులను కాపాడేందుకు, మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దించినట్లు వెల్లడించింది.

మధ్యప్రదేశ్‌లో దీపావళి రాత్రి పెనువిషాదం

వేర్వేరు ఘటనల్లో 12 మంది మృతి

భోపాల్, నవంబరు 9: మధ్యప్రదేశ్‌లో దీపావళి రాత్రి పెను విషాదం చోటుచేసుకున్నది. రెండు వేర్వేరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. ఆ ప్రమాదాల్లో 12 మంది మృతిచెందారు. రెండు కుటుంబాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కట్నీ, సియోని జిల్లాల్లో ఆదివారం రాత్రి ఈ ప్రమాదాలు జరిగాయి. కట్నీ జిల్లాలోని బర్హి పట్టణంలో ఓ అగర్వాల్ కుటుంబానికి చెందిన ఆరుగురు అగ్నిప్రమాదానికి బలయ్యారు. మూడు అంతస్తుల భవనంలో కింద క్రాకర్ షాపు ఉన్నది. అయితే పైఅంతస్తులో ఓ కుటుంబం నివసిస్తోంది. రాత్రి ప్రమాదం జరగడంతో మంటలు పైకి వ్యాపించాయి. నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో ఆరుగురు కాలి బూడిదయ్యారు. మృతులను పూరన్ అగర్వాల్, చంద్రకళ, పూనమ్, ఆర్యా, అన్వీగా గుర్తించారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. తెల్లవారుజామున మృతదేహాలను వెలికితీశారు. షార్ట్ సర్క్యూట్ లేదా దీపాల వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక సియోనీ జిల్లాలోని చాపారా పట్టణంలో మరో ప్రమాదం జరిగింది. ఓ నగల వ్యాపారి ఇంట్లో ప్రమాదం జరగడంతో ఆరుగురు మృతిచెందారు. మృతులను కుందన్ లాల్ సోనీ, రాజ్‌కుమారి సోనీ, రీతూ సోనీ, స్మృతి సోనీ, సూర్య సోనీ, ఆదిత్య సోనీగా గుర్తించారు. మరో నలుగురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అగ్నిప్రమాద సమయంలో ఇంట్లో పది మంది ఉన్నారు. గాఢ నిద్రలో ఉనప్పుడు ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. రెండు ఘటనలు మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదాన్ని నింపాయి.

నేడు బిజెపి ఆధ్వర్యంలో వైఎంసిఎలో సదర్ మేళా ఉత్సవాలు

సదర్ ఉత్సవాలకు

కర్ణాటక గవర్నర్ సుధాయాదవ్ రాక

హైదరాబాద్,నవంబరు9,ప్రభాతవార్త: హైదరాబాద్‌లో సదర్ సంబరాల నిర్వహణకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. దీపావళి తర్వాత జరిగే సదర్ సంబరాల్లో పాల్గొనేందుకు కర్ణాటక గవర్నర్ సుధా యాదవ్ రానున్నారు. నారాయణగూడలో జరిగే సంబరాల్లో పాల్గొంటారు. కర్ణాటక గవర్నర్ సుధ యాదవ్ రాక కోసం బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. దీపావళి పండుగ తర్వాత రెండోరోజు యాదవ్ సమాజం ఘనంగా నిర్వహించుకునే సదర్ ఉత్సవాలకు కర్ణాటక గవర్నర్ సుధా యాదవ్ హాజరుకానున్నారు. ఈ వేడుకలకు హాజరు కావాల్సిందిగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వారిని ఇటీవల ఆహ్వానించారు.కేంద్ర మంత్రి ఆహ్వానాన్ని మన్నించి మంగళవారం జరగనున్న సదర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు గవర్నర్ సుధా యాదవ్ అంగీకరించారు. సాయంత్రం 7.10 గంటలకు గవర్నర్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి తెలంగాణ లోక్‌భవన్‌కు వెళ్తారు. రాత్రి 10 గంటలకు వైఎంసిఏలో సదర్ ఉత్సవాల ప్రాంగణానికి చేరుకుంటారు. గంట పాటు అక్కడి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సదర్ మేళా ఉత్సవాల నేపథ్యంలో

నారాయణగూడ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

మంగళవారం 10 రాత్రి 7 గంటల నుంచి 11వ తేదీ ఉదయం 4 గంటల వరకు నారాయణగూడలోని వైఎంపీఏ వద్ద సదర్ ఉత్సవ మేళాను నిర్వహించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ ఉత్సవం సందర్భంగా నారాయణగూడ పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయన్నారు. ఈ మేరకు రాంకోటి, లింగంపల్లి, విఠల్‌వాడి, ఆర్టీసీ చౌరస్తాల నుంచి వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తామని తెలిపారు. బర్మత్‌పురా, కాచిగూడ, పోస్ట్ ఆఫీస్ జంక్షన్, క్రౌన్ కేఫ్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తామని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు సికింద్రాబాద్ కోటి మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులు వైఎంసీఏ, నారాయణగూడ మార్గాలను ఎంచుకోకుండా.. ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించాలని సూచించారు. అలాగే.. బర్మత్‌పురా, పోస్ట్ ఆఫీస్ జంక్షన్, బాగ్ లింగంపల్లి, వీఎస్టీ మీదుగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు ఉంటాయన్నారు. సదర్ మేళాకు వచ్చే సందర్శకుల వాహనాల పార్కింగ్ కోసం కేశవ్ మెమోరియల్ కాలేజీ మైదానంలో ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో ప్రజలు సహకరించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

దీపావళి పండగ ఎఫెక్ట్

డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 578 మంది మందుబాబుల పట్టివేత

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొ నసాగుతూనే వున్నాయి. దీపావళి పండగకు ముందుగా శుక్రవారం, శనివారం రాత్రి వేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 578 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 495 మంది ద్విచక్ర వాహనదారులు, 28 మంది ఆటో డ్రైవర్లు, 55 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 115 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 257 మంది 51 నుంచి 100 పాయిం ట్ల వరకు, 111 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 52 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు , 27 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, 11 మంది 251 నుంచి 300 పాయింట్ల వరకు వుండగా ఐదుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించాక కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధి స్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పో లీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరం తరం కొనసాగుతాయని వెల్లడించారు. కాగా సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధుల్లోనూ పెద్దసంఖ్యలో మందు బాబులు పోలీసులకు పట్టుబడ్డారు.

ఉక్రెయిన్ శాంతికి భారత్ సాయం

జెలెన్‌స్కీతో ఫోన్‌లో సంభాషించిన ప్రధాని మోడీ

ఇరు దేశాల ద్వైపాక్షిక సహకారంపై చర్చలు

న్యూఢిల్లీ, నవంబరు 9: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమ వారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నేతలు కొనసాగుతున్న రష్యాఉక్రెయిన్ యుద్ధ పరిస్థితులు, భారత్ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చించారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు చేపట్టే అన్ని ప్రయత్నాల్లో భారత్ భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేసినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది. భారత్ ఎల్లప్పుడూ మానవతా దృక్పథానికే ప్రాధాన్యత ఇస్తుందని మోడీ పునరుద్ఘాటించారు. యుద్ధ సమస్యకు చర్చలు, దౌత్యపరమైన ప్రయత్నాల ద్వారానే పరిష్కారం లభించాలని భారత్ మొదటి నుంచీ చెబుతోందని పేర్కొన్నారు. జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫలవంతమైన ఫోన్ సంభాషణ జరిపాను. ఇరు దేశాల మధ్య విస్తృత స్థాయిలో ఉన్న ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించాం. భారత్ఉక్రెయిన్ సంబంధాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాం. కొనసాగుతున్న యుద్ధం, దాని వల్ల తలెత్తిన మానవతా సమస్యలు, శాంతి పునరుద్ధరణకు జరుగుతున్న ప్రయత్నాలపై తన అభిప్రాయాలను పంచుకున్నందుకు జెలెన్‌స్కీకి ధన్యవాదాలు తెలిపాను. శాంతియుత పరిష్కారం కోసం సాధ్యమైన అన్ని మార్గాల్లో సహకరించేందుకు భారత్ కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశానని మోడీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెలెన్‌స్కీ మాట్లాడుతూ తాజా దౌత్యపరమైన పరిణామాలను మోడీకి వివరించినట్లు తెలిపారు. అబుదాబిలో జరగనున్న సమావేశానికి సంబంధించిన ప్రతి అంశంపై ఉక్రెయిన్ చురుగ్గా సన్నాహాలు చేస్తోందన్నారు. ఉక్రెయిన్ ఎప్పుడూ నిర్మాణాత్మక వైఖరితో వ్యవహరిస్తోంది.

ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా కూడా అదే విధమైన సిద్ధతను ప్రదర్శించాలి. యుద్ధాన్ని కొనసాగిం చడం కంటే ముగించేందుకు ఇదే సరైన సమయమని భారత ప్రధాని పలు మార్లు చెప్పారు. రష్యా అధ్యక్షుడితో నేరుగా మాట్లాడిన సందర్భంలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారని జెలెన్‌స్కీ వెల్లడించారు. యుద్ధం ముగింపునకు భారత్ ఎలాంటి చర్యలు తీసుకోగలదో, ఇతర దేశాల నాయకులతో ఎలాంటి చర్చలు జరపగలదో పరిశీలించడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆహార భద్రత కూడా ఈ దిశగా కీలక అంశంగా మారవచ్చన్నారు. నల్ల సముద్రం మార్గం ద్వారా ధాన్య ఎగుమతులను రష్యా అడ్డుకుంటున్న అంశంపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపారు. ఆహార రవాణా కోసం ప్రత్యేక మార్గాల ఏర్పాటు విషయంలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలు కొనసాగుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. సముద్ర మార్గాల దిగ్బంధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రష్యా అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ అంశాలతో పాటు ఇతర ద్వైపాక్షిక సమస్యలపై ఇరు దేశాల ప్రతినిధి బృందాలు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు.

నేరుగా రైస్ మిల్లర్ల నుంచే బియ్యం తెప్పించుకోవచ్చు

పౌర సరఫరాల శాఖ

హైదరాబాద్,నవంబరు9,ప్రభాతవార్త: బియ్యం విక్రయాల్లో జరుగుతున్న అక్రమాలపై పౌర సరఫరాల శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. 25 కిలోల బస్తాపై 26 కిలోల స్టిక్కర్ వేసి విక్రయించడం.. అసలు ఎమ్మార్పీపై అధిక ధరలతో నకిలీ స్టిక్కర్లు అతికించడం వంటి మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేసింది. పదే పదే నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై పీడీ యాక్ట్ ప్రయోగించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. రిటైల్ వ్యాపారులకు బియ్యం సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం మరో కీలక వెసులుబాటు కల్పించింది. ఇకపై రిటైలర్లు హోల్‌సేల్ వ్యాపారులపై ఆధారపడాల్సిన అవసరం లేదని.. నేరుగా రైస్ మిల్లర్ల నుంచే బియ్యం తెప్పించుకోవచ్చని పౌరసరఫరాల శాఖ వెల్లడించింది.

ఎక్కడైనా బియ్యం స్టాక్ అందుబాటులో లేకపోతే సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారులను సంప్రదించాలని సూచించింది. బియ్యం ధరల నియంత్రణ కోసం క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ శాఖలు సంయుక్తంగా రిటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాయి. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. బియ్యం ధరల విషయంలో వినియోగదారులు మోసపోకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. నిర్ణయించిన గరిష్ట ధరలకు మించి ఎవరైనా బియ్యం విక్రయిస్తే పౌరసరఫరాల శాఖకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచే ప్రయత్నాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు.

బ్రిటిష్ నటుడు రస్సెల్ బ్రాండ్‌కు పదేళ్లుపైగా జైలుశిక్ష



లండన్, నవంబరు 9 : బ్రిటిష్ హాస్యనటుడు, నటుడు రస్సెల్ బ్రాండ్‌కు అత్యాచారం, లైంగిక వేధింపుల కేసులో 10 ఏళ్ల 6 నెలల జైలు శిక్ష విధించారు. నలుగురు మహిళలకు సంబంధించిన కేసులో ఆయన దోషిగా తేలడంతో లండన్‌లోని సౌత్‌వార్క్ క్రౌన్ కోర్టు సోమవారం ఈ శిక్ష ఖరారు చేసింది. 51 ఏళ్ల రస్సెల్ బ్రాండ్‌పై నమోదైన ఆరోపణల్లో ఒక అత్యాచారం, మూడు లైంగిక దాడుల కేసుల్లో కోర్టు ఆయనను దోషిగా నిర్ధారించింది. ఈ ఘటనలు 2004 నుంచి 2009 మధ్య జరిగినట్లు విచారణలో వెల్లడైంది. అయితే తనపై వచ్చిన ఆరోపణలను రస్సెల్ బ్రాండ్ మొదటి నుంచీ ఖండించారు. తాను నిర్దోషినని వాదించారు. మరో రెండు అత్యాచార ఆరోపణలు, ఒక అసభ్య ప్రవర్తనకు ప్రయత్నించిన కేసు నుంచి ఆయనను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. శిక్ష ఖరారు సందర్భంగా న్యాయమూర్తి జోయెల్ బెన్నథన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రముఖుడిననే హోదా తనకు చట్టాన్ని, ఇతరుల వ్యక్తిగత హద్దులను పట్టించుకోకుండా ప్రవర్తించే హక్కును కల్పిస్తుందని బ్రాండ్ భావించారని న్యాయమూర్తి పేర్కొన్నారు. "పేరు ప్రఖ్యాతులు ఉంటే, ఎప్పుడు ఎలా కావాలంటే అలా ప్రవర్తించవచ్చని, సాధారణ వ్యక్తులు పాటించే నియమాలు తనకు వర్తించవని ఆయన భావించారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పు ప్రకారం రస్సెల్ బ్రాండ్ తన శిక్షలో మూడింట రెండొంతుల కాలాన్ని జైలులో గడపాల్సి ఉంటుంది. ఆ తర్వాత కొన్ని షరతులతో బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం ఉంటుంది. నాలుగు వారాల పాటు జరిగిన విచారణలో రస్సెల్ బ్రాండ్‌తో గతంలో పరిచయం ఉన్న మహిళలు పలు సంఘటనలకు సంబంధించి ఆరోపణలు చేశారు. ఆయన వృత్తిపరమైన, సామాజిక కార్యకలాపాల సమయంలో ఈ పరిచయాలు ఏర్పడినట్లు ప్రాసిక్యూషన్ వివరించింది.

డిమాండ్‌కు అనుగుణంగా ఇంధన ప్రణాళికలు

దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ డైరెక్టర్ చక్రపాణి

హైదరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని విస్తరించడంతో పాటు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ డైరెక్టర్ చక్రపాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో భవిష్యత్తు మార్పులను ముందుగానే అంచనా వేసి, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, బ్యాటరీ తయారీ, ఎనర్జీ స్టోరేజ్ సాంకేతికతల్లో దేశంలోనే కీలక పెట్టుబడి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలన్నారు. ప్రస్తుతం సుమారు 20,018 మెగావాట్ల స్థాయికి చేరుకుందని చెప్పారు. ప్రస్తుతం రోజువారీ విద్యుత్ అవసరం సుమారు 334 మిలియన్ యూనిట్ల స్థాయికి చేరుకోగా, తలసరి విద్యుత్ వినియోగం సంవత్సరానికి 2,500 యూనిట్లను దాటిందని వెల్లడించారు రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు, పరిశ్రమల్లో ఆటోమేషన్, గృహాల్లో ఆధునిక విద్యుత్ పరికరాల వినియోగం, ఇండక్షన్ ఆధారిత వంట విధానాలు, వ్యవసాయ రంగంలో విద్యుదీకరణ కారణంగా విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే వీలుందన్నారు. ఈ పరిస్థితుల్లో సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి వనరులపై మాత్రమే ఆధారపడకుండా పునరుత్పాదక ఇంధన వనరులను విస్తరించడంతో పాటు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను అవసరమైన సమయంలో వినియోగించుకునేలా నిల్వ వ్యవస్థలను అభివృద్ధి చేయడం అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. గ్లోబల్ సమిట్ ద్వారా అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పడి, కొత్త ప్రాజెక్టులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు రాష్ట్రానికి అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఢిల్లీ అలర్లకు యేడాది.. 300 మందికిపైగా అరెస్టు

విదేశాల్లో ఉన్న 73 మందిని

రప్పించిన ఎన్ఐఏ

న్యూఢిల్లీ, నవంబరు 9: దేశ రాజధాని దిల్లీలో ఎర్రకోట పేలుడు జరిగి ఓ ఏడాది గడిచిన నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను కట్టుదిట్టం చేశాయి. గడిచిన ఏడాది కాలంలో సరిహద్దు అవతల నుంచి సాగుతున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌పై భద్రతా దళాలు భారీ దాడులు జరిపాయి. వీటిల్లో 300 మందికి పైగా ఉగ్రవాద ఆపరేటివ్‌లను అరెస్ట్ చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులను భారతదేశానికి రప్పించారు. ఎర్రకోట పేలుడుతో ఇలాంటి దాడులను నివారించడానికి కేంద్ర నిఘా సంస్థలు ఒక విధానాన్ని రూపొందించాయి. ఈ ఆలోచనతోనే ఫిబ్రవరి 23న ప్రహార్ జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్ విధానాన్ని ఉంటుందని 2026 సెప్టెంబర్లో జరిగిన రాష్ట్ర డీజీపీలు, కేంద్ర ఏజెన్సీ అధిపతుల ఉన్నత స్థాయి సమావేశంలో స్పష్టం చేసింది. ఈ ప్రహార్ వ్యూహంలో భాగంగానే పాకిస్తాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న షహజాద్ భట్టి నెట్‌వర్క్ పై దేశవ్యాప్తంగా దాడులు చేసి 100కు పైగా ఎఫ్ఐఆర్లు నమోదు చేశారు. దాదాపు 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు, పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న హ్యాండ్ గ్రెనేడ్లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద ఎస్ఎఫ్ఐఎన్‌ను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్లో ప్రత్యేక ఎక్స్‌ట్రడిక్షన్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీనివల్ల గడిచిన ఏడాది కాలంలో విదేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాదులను భారత్‌కు రప్పించగలిగారు. మరోవైపు బాంబుల తయారీకి వాడే అమ్మోనియం నైట్రేట్ అమ్మకాలపై ఇప్పుడు ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరుగుతున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి.



రుణాలు చెల్లించలేక 10 కోట్ల మంది కస్టమర్లు సతమతం

రోజురోజుకూ దిగజారుతున్న

చైనా ఆర్థిక వ్యవస్థ

బీజింగ్, నవంబరు 9: చైనాలో ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడటంతో సుమారు 10 కోట్ల మంది వినియోగదారులు తాము తీసుకున్న వ్యక్తిగత రుణాలను తిరిగి చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగాలు కోల్పోవడం, రియల్ ఎస్టేట్ రంగం కుదేలవడం, కరోనా మహమ్మారి దీర్ఘకాలిక ప్రభావాల వల్ల చైనాలో కుటుంబాల ఆర్థిక పరిస్థితి బలహీనపడింది. గేవికల్ డ్రాగనోమిక్స్ అనే సంస్థ అంచనాల ప్రకారం ఈ సంఖ్య భారీ స్థాయిలో ఉంది. రాయునియన్ క్రెడిట్ ప్లాట్‌ఫామ్ డేటా ప్రకారం.. చెల్లించని వినియోగదారుల రుణాల మార్కెట్ చైనాలో భారీగా విస్తరించింది. 2021లో బ్యాంకులు సుమారు 18.6 బిలియన్ యువాన్ల



మొండి బకాయిలను బదిలీ చేయగా, 2025 చివరి నాటికి ఈ మొత్తం 20 రెట్లు పెరిగి దాదాపు 454 బిలియన్ యువాన్లకు చేరింది. ఇవి ఎక్కువగా క్రెడిట్ కార్డ్ బకాయిలు, వ్యక్తిగత రుణాలు వంటి అరక్షిత రుణాలే కావడం గమనార్హం. గృహ, వాహన రుణాలు ఇందులో భాగం కాదు. వుహాన్‌కు చెందిన 23 ఏళ్ల ర్యాన్ హు వంటి డెట్ కలెక్టర్లు రోజంతా రుణగ్రహీతలకు ఫోన్లు చేస్తూనే ఉన్నామని చెబుతున్నారు. వీరిలో కరోనా తర్వాత వ్యాపారాలు కోలుకోని రెస్టారెంట్ యజమానులు, రియల్ ఎస్టేట్ ఉద్యోగాలు కోల్పోయిన జంటలు, కనీసం ఇంటి అద్దె కూడా కట్టలేని యువ గ్రాడ్యుయేట్లు ఉన్నారని వారు వివరిస్తున్నారు. అధికారిక బ్యాంకింగ్ లెక్కల ప్రకారం చైనాలో గృహ రుణాల ఎగవేత రేటు 3 శాతం కంటే తక్కువగానే ఉంది. ఇది అమెరికా కంటే మెరుగైనప్పటికీ, వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. చాలా మంది రీఫైనాన్సింగ్ ద్వారా లేదా కుటుంబ సభ్యుల సహాయంతో వాయిదాలు చెల్లిస్తుండటం, దేశవ్యాప్తంగా వ్యక్తిగత దివాలా చట్టం లేకపోవడం వంటి కారణాలతో అసలు సమస్య బయటకు రావడం లేదని వారు పేర్కొంటున్నారు. ఈ యేడాది చైనా ప్రభుత్వం రుణ వసూళ్లపై కఠినమైన నిబంధనలు ప్రవేశపెట్టింది. దీంతో దూకుడుగా సాగే వసూళ్ల పద్ధతులు తగ్గాయి, రికవరీ రేట్లు మందగించాయి.



8 బిలియన్ డాలర్లతో బ్రహ్మోస్ కొనుగోలుకు ఫిలిప్పీన్స్ సిద్ధం

మనీలా, నవంబరు 9: భారత్ తయారు చేసిన అత్యాధునిక బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను అదనంగా కొనుగోలు చేసేందుకు ఆగ్నేయాసియా దేశమైన ఫిలిప్పీన్స్ సిద్ధమవుతోంది. తమ దేశ భౌగోళిక స్వరూపం, స్థానిక మౌలిక వసతులకు అనుగుణంగా ఈ క్షిపణుల్లో కొన్ని మార్పులు చేయాలని కోరుతూ ఇప్పటికే భారత ప్రభుత్వానికి ప్రతిపాదనల జాబితాను కూడా సమర్పించింది.ఈనెల 4న ఢిల్లీలో జరిగిన మూడో ఢిల్లీ డిఫెన్స్ డైలాగ్ సదస్సులో ఫిలిప్పీన్స్ రక్షణ మంత్రి గిల్బర్టో టియోడోరో ఈ కీలక వివరాలను వెల్లడించారు. తమ వద్ద ఉన్న బ్రహ్మోస్ క్షిపణి యూనిట్ల సంఖ్యను మరింత పెంచుకోవాలని భావిస్తున్నామని, ఫిలిప్పీన్స్ సహజ వాతావరణానికి మరింత సరిపోయేలా వాటి రూపకల్పనలో మార్పులు చేయాలని భారత అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ సరికొత్త ఒప్పందం కింద ఫిలిప్పీన్స్ దాదాపు 5 బ్రహ్మోస్ వ్యవస్థలను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఈ భారీ రక్షణ ఒప్పందం విలువ 700 నుంచి 800 మిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. గతంలో, అంటే 2022లో ఫిలిప్పీన్స్ ప్రభుత్వం తన నౌకాదళం కోసం తీర ప్రాంత ఆధారిత యాంటీషిప్ వేరియంట్ బ్రహ్మోస్ క్షిపణుల సరఫరాకు సంబంధించి భారత్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం చేసుకుంది. దక్షిణ చైనా సముద్రం మొత్తం తమదేనంటూ ఆధిపత్యం ప్రదర్శిస్తున్న చైనాకు దీటుగా బదులిచ్చేందుకే ఫిలిప్పీన్స్ ఈ క్షిపణులను సమకూర్చుకుంటోంది. బ్రహ్మోస్‌ను కేవలం ఒక సాధారణ ఆయుధంగా మాత్రమే చూడకుండా, తమ సమగ్ర తీర రక్షణ, సుదూర లక్ష్యాలను ఛేదించే ప్రధాన వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో భాగంగా మనీలా వినియోగిస్తోంది. ఇందుకోసం పశ్చిమ లుజాన్ తీరంలోని జాంబలేస్‌లో గల ఫిలిప్పీన్స్ నావల్ స్టేషన్ లియోవిగిల్డ్ గాంట యోక్వి వద్ద ఇప్పటికే ప్రత్యేక బ్రహ్మోస్ కేంద్రాన్నిసైతం ఏర్పాట



చెన్నై ఓపెన్ ఛాంపియన్‌గా లినెట్

డబుల్స్ ఫైనల్‌లో వైష్ణవి-భోసలే ఓటమి

చెన్నై: పోలాండ్‌కు చెందిన మాగ్డా లినెట్ సోమవారం జరిగిన చెన్నై ఓపెన్ టైటిల్ పోరులో టాప్ సీడ్, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఇండోనేషియా క్రీడాకారిణి జానిస్ జెన్‌ను ఓడించి, తన నాలుగో డబ్ల్యూటీఏ ట్రోఫీని కైవసం చేసుకుంది. 2 గంటల 43 నిమిషాల పాటు సాగిన ఫైనల్‌లో, లినెట్ ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని 5-7, 6-1, 6-4 తేడాతో విజయం నమోదు చేసింది. 2022లో చెన్నై ఓపెన్‌లో లిండా ఫ్రూవిర్టోవా చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన లినెట్‌కు ఈ విజయం ప్రత్యేకంగా ముఖ్యమైనది. ఈ చెన్నై టైటిల్ ఆమె కెరీర్‌లో తొమ్మిదవ ఫైనల్ మరియు ఆమె బహుళ ఫైనల్స్‌లో పోటీపడిన మొదటి టోర్నమెంట్‌గా నిలిచింది. లినెట్ రెండేళ్లకు పైగా కాలంలో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. సింగిల్స్ ఫైనల్ వాస్తవానికి ఆదివారం జరగాల్సి ఉండగా, ఎస్‌డిఎటి టెన్నిస్ స్టేడియంలో వర్షం, దీపావళి బాణాసంచా నుండి వెలువడిన దట్టమైన పొగ కారణంగా దాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు మార్చారు. అంతకు ముందు జరిగిన డబుల్స్ ఫైనల్‌లో స్విట్జర్లాండ్‌కు చెందిన నైమా కరమోకో, సిమోనా వాల్టర్ట్ జోడీ, భారత్‌కు చెందిన వైష్ణవి అడ్కర్, రుతుజా భోసలే ద్వయాన్ని 6-2, 6-0 తేడాతో ఓడించి తమ తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. అడ్కర్ మరియు భోసలే డబ్ల్యూటిఎ టూర్ డబుల్స్ ఫైనల్‌కు చేరిన మొట్టమొదటి పూర్తి భారత జంటగా నిలిచి, సెమీఫైనల్స్‌లో రెండవ సీడ్స్ అయిన వెరోనికా ఫాల్కోవ్స్కా, అలనా స్మిత్‌లకు షాక్ ఇచ్చారు.



దక్షిణాఫ్రికా మహిళల సిరీస్:

స్మృతికి డిప్యూటీగా దీప్తి

భారత్ జట్టులో జెమీమా పునరాగమనం

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో డిసెంబరులో జరిగే అన్ని ఫార్మాట్ల పర్యటన కోసం భారత మహిళల జట్టును బీసీసీఐ సోమవారం ప్రకటించింది. స్మృతి మంధాన అన్ని ఫార్మాట్లలో జట్టుకు నాయకత్వం వహించనుండగా, రెండు లాంగర్ ఫార్మాట్లలో దీప్తి శర్మ ఆమెకు డిప్యూటీగా వ్యవహరించనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని మూడు జట్లలో కూడా ఎంపికయ్యారు. టీ20లలో షఫాలీ వర్మ వైస్ కెప్టెన్ పాత్రను తిరిగి ప్రారంభించనుంది. గాయం కారణంగా జింబాబ్వే సిరీస్‌కు దూరమైన జెమిమా రోడ్రిగ్స్ వైట్‌బాల్ జట్టులోకి తిరిగి వచ్చింది. భారత్, దక్షిణాఫ్రికాతో ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. ఈ ఏకైక టెస్టు డిసెంబర్ 9న గెబెర్హాలో ప్రారంభం కాగా, ఆ తర్వాత డిసెంబర్ 16 నుంచి 22 వరకు పార్ల్, కేప్ టౌన్, బ్లూమ్‌ఫోంటైన్‌లలో వన్డేలు జరుగుతాయి. టీ20లు డిసెంబర్ 26 నుండి 30 వరకు బెనోని మరియు పోట్చెఫ్‌స్ట్రూమ్‌లలో జరుగుతాయి. టీ20 జట్టులో శ్రేయాంక పటిల్‌ను మినహాయించారు. స్పిన్ విభాగంలో దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రవత్ ఉన్నారు. జింటిమాని కలితాకు ఈ జట్టులో స్థానం దొరకలేదు. జింటిమాని కలితా జింబాబ్వేకు వ్యతిరేకంగా జరిగిన వన్డే సిరీస్‌లో అంతర్జాతీయ డెబ్యూ చేసింది.

నేడు న్యూజిలాండ్‌తో అమీతుమీ

కీలక పోరుకు సిద్ధమైన టీమిండియా.. తుది జట్టులో నలుగురికి నిరాశే

హామిల్టన్: న్యూజిలాండ్ పర్యటనలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. హామిల్టన్ వేదికగా ఈ నెల 10వ తేదీన జరిగే మూడో వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే ఇది కూడా గెలిచి మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై ఆశలు సజీవంగా ఉంచుకోవాలని న్యూజిలాండ్ భావిస్తోంది. మూడో వన్డేలోనూ టీమిండియా తమ విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగించే అవకాశం ఉంది. నలుగురు యువ పేసర్లు అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబర్చడంతో మూడో వన్డేలోనూ వారినే కొనసాగించనున్నారు. ఈ మ్యాచ్ తర్వాత టెస్ట్ టీమ్ ఆటగాళ్లు చివరి రెండు వన్డేలకు దూరం కానున్నారు. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. దాంతోనే విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగించనున్నారు. ఫలితంగా మహమ్మద్ సిరాజ్, ఇషాన్ కిషన్, కుల్దీప్ యాదవ్, రుతురాజ్ గైక్వాడ్‌లకు నిరాశే ఎదురవ్వనుంది. ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ ఆడనున్నారు. తొలి వన్డేలో పర్వాలేదనిపించిన గిల్ రెండో వన్డేలో డకౌటయ్యాడు. మూడో వన్డేలో భారీ ఇన్నింగ్స్ ఆడాల్సిన బాధ్యత అతనిపై ఉంది. తొలివన్డేలో విఫలమైనా,రెండో వన్డేలో ప్రతికూలమైన బ్యాటింగ్‌పరిస్థితుల్లో రోహిత్ శర్మ భారీషాట్స్ ఆడాడు. కానీ భారీఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. ఇక విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి వన్డేలో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసిన కోహ్లీ రెండో వన్డేలో నిరాశపర్చాడు. మూడో వన్డేలో అతను చెలరేగితే భారత్‌కు తిరుగుండదు. రెండో వన్డేలో అయ్యర్ కీలక భాగస్వామ్యం నమోదు చేసినా, స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ అయితే ఆడలేదు. అక్షర్ పటేల్, నమన్ ధీర్ స్పిన్ ఆల్‌రౌండర్లుగా బరిలోకి దిగనున్నారు. పేసర్లకు తోడుగా ఈ ఇద్దరూ అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లో సత్తా చాటితే భారత్ విజయం ఈజీ అవుతుంది.







సెనెగల్: డాకర్

2026 యూత్ ఒలింపిక్ క్రీడల్లో భారత క్రీడాకారిణి శౌర్య అంబురే చిరస్మరణీయ ప్రదర్శన కనబరిచింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో చారిత్రాత్మక కాంస్య పతకాన్ని గెలుచుకుని, ఈ క్రీడల్లో దేశానికి తొలి ట్రాక్ అండ్ ఫీల్డ్ పతకాన్ని అందించింది. మహారాష్ట్రకు చెందిన 17 ఏళ్ల క్రీడాకారిణి శౌర్య 13.59 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసి ఫైనల్లో మూడో స్థానంలో నిలిచింది. కేవలం 0.02 సెకన్ల తేడాతో ఆమె రజత పతకాన్ని కోల్పోయింది. చైనాకు చెందిన జాంగ్ కెయి 13.17 సెకన్ల సమయంతో స్వర్ణం కైవసం చేసుకోగా, ఫ్రాన్స్‌కు చెందిన అన్నా పీటర్స్ 13.57 సెకన్లతో రజతం గెలుచుకున్నారు. ఈ గేమ్స్‌లో పోటీపడిన భారతదేశపు ఏకైక ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ శౌర్య కావడం ఆమె సాధించిన ఘనతకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అంతేకాకుండా, ఆమె అదే రోజు రెండుసార్లు తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను మెరుగుపరుచుకుంది. ఇది ఆమె నిలకడను, ఎటువంటి సందర్భాలలో రాణించగల సామర్థ్యాన్ని నొక్కి చెబుతుంది. సెమీఫైనల్స్‌లో 13.77 సెకన్ల సమయం నమోదు చేసి, మెడల్ రేస్‌కు అర్హత సాధించడం ద్వారా శౌర్య అప్పటికే తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆ తర్వాత ఫైనల్లో తన ప్రదర్శనను మరింత మెరుగుపరుచుకుని, ఆ సమయం నుండి 0.18 సెకన్లు తగ్గించి పోడియంపై స్థానం సంపాదించింది.

ఆసియా కప్‌లో పాక్ చేతిలో భారత్ ఓటమి

3 వికెట్లు తేడాతో దాయాది గెలుపు

ఒమన్: అండర్19 ఆసియా కప్ 2026లో భాగంగా ఒమన్‌లో జరిగిన ఉత్కంఠభరితమైన పోరులో భారత్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో దాయాది పాకిస్తాన్ 3 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 209 పరుగుల లక్ష్యాన్ని పాకిస్తాన్ 48.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అర్జున్ రాజ్‌పుత్ వీరోచిత సెంచరీతో భారత్‌ను ఆదుకున్నప్పటికీ, జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ కూడా ఒకానొక దశలో త్వరగానే వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. అయితే వికెట్ కీపర్ బ్యాటర్ హమ్జా జహూర్ (100 నాటౌట్) అజేయ సెంచరీతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతనికి అండగా నిలిచిన హస్నైన్ అబ్బాస్ దార్(38) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరూ కలిసి ఆరో వికెట్ కు ఏకంగా 107 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి పాకిస్తాన్ విజయంలో కీలక పాత్ర పోషించారు. అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత అండర్19 జట్టు 46.3 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. భారత ఇన్నింగ్స్ ప్రారంభంలోనే దెబ్బతింది. కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయచందానీ(0), వీకే వినీత్(8), యశ్వర్ధన్ చౌహాన్(1) త్వరగానే వెనుదిరిగారు. ఆ తర్వాత ఆర్యవీర్ సెహ్వాగ్(22), వికెట్ కీపర్ అన్వయ్(10) కూడా తక్కువ పరుగులకే ఔట్ కావడంతో భారత్ 86 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అర్జున్ రాజ్‌పుత్(107) అద్భుత పోరాటం కనబరిచాడు. కేవలం 80 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్న అర్జున్, మనల్ చౌహాన్(11)తో కలిసి ఆరో వికెట్‌కు 64 పరుగులు జోడించాడు. చివర్లో కావ్య పటేల్(23) ఉపయోగకరమైన పరుగులు చేయడంతో భారత్ 208 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో అలీ రజా, రిజ్వానుల్లా, నికాబ్ షఫీక్ తలో 3 వికెట్లు పడగొట్టారు. హమ్జా జహూర్ సెంచరీతో ఈ ఉత్కంఠ పోరులో పాకిస్తాన్ విజయం సాధించగా, భారత అండర్19 జట్టు శ్రమకు ఫలితం దక్కలేదు. ఈ నెల 10న యూఏఈతో మ్యాచ్ గెలిస్తే ఇండియా సెమీస్ చేరుతుంది.





స్వల్ప లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

పిఎస్‌యు బ్యాంకింగ్, హెల్త్‌కేర్ షేర్లలో కొనుగోళ్ల జోరు, ఐటీ షేర్లపై ఒత్తిడి

ముంబయి, నవంబరు 9: దేశీయ స్టాక్ మార్కెట్ కీలక సూచీలు సోమవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయమార్కెట్లలో సానుకూల వాతావరణం, ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి కొనసాగుతున్న పెట్టుబడులు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. భారత ఈక్విటీ మార్కెట్లపై ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మెరుగుపడటంకూడా సూచీలపెరుగుదలకు దోహద పడింది. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, హెల్త్‌కేర్ షేర్లు లాభాలను నమోదు చేయగా, ఐటీ రంగ షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 107.25 పాయింట్లు లాభపడి 81,106.65 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టి50 సూచీ 58.25 పాయింట్లు పెరిగి 25,044.65 వద్ద స్థిరపడింది. నేటి ట్రేడింగ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.56), హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ (1.79), ఐసిఐసిఐ బ్యాంక్ (1.53) షేర్లు నిఫ్టీకి ప్రధానంగా అండగా నిలిచాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.28 శాతం పెరగగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.15 శాతం నష్టపోయింది. బిఎస్ఇలో 2,010 షేర్లు లాభపడగా, 2,422 షేర్లు నష్టపోయాయి. మరో 247 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. దీపావళి బలిపాడ్యమి సందర్భంగా మంగళవారం ఎన్ఎస్ఇ, బిఎస్ఇలకు సెలవు ప్రకటించారు. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ డిసెంబరు 2026 కాంట్రాక్ట్ ధర బ్యారెల్‌కు 1.30 డాలర్లు తగ్గి 97.02 డాలర్లకు చేరింది. భారతదేశ 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ల రాబడి గత సెషన్ ముగింపు స్థాయి 7.195 శాతం నుంచి 7.181 శాతానికి తగ్గింది. విదేశీ మారక మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడింది. గత ట్రేడింగ్ సెషన్‌లో 93.9850 వద్ద ముగిసిన రూపాయి, సోమవారం 93.8700 వద్ద ట్రేడైంది. ఎంసిఎక్స్‌లో డిసెంబరు 4, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర0.60శాతంపెరిగి రూ.1,43,408కు చేరింది. నిఫ్టీ పిఎస్‌యు బ్యాంక్ సూచీ 3.73 శాతం ఎగబాకి 8,905.35 వద్ద ముగిసింది. గత సెషన్‌లో నమోదైన 0.32 శాతం నష్టాల నుంచి ఈ సూచీ కోలుకుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 5.60 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 5.27 శాతం, బ్యాంక్ ఆఫ్ ఇండియా 4.53 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 4.46 శాతం, ఇండియన్ బ్యాంక్ 4.35 శాతం చొప్పున లాభపడ్డాయి. కెనరా బ్యాంక్ 4.02 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.56 శాతం పెరిగాయి. ఇతర లాభపడిన బ్యాంకుల్లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 1.74 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.56 శాతం, యూకో బ్యాంక్ 0.92 శాతం, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 0.84 శాతం, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ 0.82 శాతం చొప్పున పెరిగాయి. లార్సెన్ అండ్ టూబ్రో షేరు 1.82 శాతం లాభపడింది. గ్లాండ్ ఫార్మా షేరు 5.41 శాతం దూసుకెళ్లింది. హోనాసా కన్స్యూమర్ షేరు 2.98 శాతం పెరిగింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేరు 1.97 శాతం లాభపడింది. టాటా స్టీల్ షేరు 2.81 శాతం పడిపోయింది. మోర్‌పెన్ ల్యాబొరేటరీస్ షేరు 5 శాతం ఎగబాకింది. అఫోర్డబుల్ రోబోటిక్ అండ్ ఆటోమేషన్ షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి.



లక్ష్మీపూజ రోజు పసిడి కొనుగోళ్ల

టర్నోవర్ రూ.62 వేల కోట్లు

ముంబయి, నవంబరు 9: దేశవ్యాప్తంగా ధన్‌తేరస్, లక్ష్మీ పూజ పర్వదినాల సందర్భంగా బంగారం అమ్మకాలు సరికొత్త రికార్డు దిశగా సాగుతున్నాయి. మార్కెట్లో ధరలు గణనీయంగా పెరిగినప్పటికీ వినియోగదారుల్లో కొనుగోలు ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. ఈ పండుగ సీజన్‌లో దేశవ్యాప్తంగా పసిడి విక్రయాలు సుమారు రూ. 62వేల కోట్లు దాటే అవకాశముందని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ ఆదివారం వెల్లడించింది. జిజెసి చైర్మన్ రాజేష్ రోక్డే మాట్లాడుతూ చారిత్రకంగా బంగారం అందిస్తున్న మెరుగైన రాబడులు, సంప్రదాయ ప్రాధాన్యత మరియు ఇన్వెస్టర్లలో పెరుగుతున్న నమ్మకమే ఈ భారీ డిమాండ్‌కు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. మన మతపరమైన, సాంస్కృతిక సంప్రదాయాల్లో లక్ష్మీ పూజ, ధన్‌తేరస్ వేళల్లో బంగారం కొనడం ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారని ఆయన వివరించారు. ఈ యేడాది పండుగ సీజన్‌లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా మధ్యవయస్కులు, పెద్దలు ఎక్కువగా ఆసక్తి చూపే బంగారం మార్కెట్‌లోకి ఈసారి యువతరం కూడా పెద్ద సంఖ్యలో అడుగుపెట్టింది. ఈ యేడాది లక్ష్మీ పూజ సందర్భంగా జెన్ జీ యువతరం కూడా



బంగారం కొనుగోలు చేయడానికి అమితాసక్తి కనబరచడాన్ని గమనించానని రోక్డే తెలిపారు. కేవలం సంప్రదాయ ఆభరణాల కొనుగోలుగానే కాకుండా, ఆర్థిక భవిష్యత్తుకు భరోసానిచ్చే బలమైన పెట్టుబడిగా యువత పసిడిని గుర్తిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

గత యేడాది కాలంలో బంగారం ధరలు మరియు రాబడుల తీరును రోక్డే విశ్లేషించారు. గత యేడాది అక్టోబర్ నాటి లక్ష్మీ పూజ నుంచి ప్రస్తుత నవంబరు నాటికి బంగారం దాదాపు 9 నుంచి 14 శాతం మేర లాభాలను అందించిందని చెప్పారు. గత మూడేళ్ల కాలంలో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ. 80,000 నుంచి రూ. 1.15 లక్షల మధ్య ఉండేదని, అయితే ప్రస్తుత పండుగ సీజన్‌లో ఇది రూ. 1.42 లక్షల నుంచి రూ. 1.43 లక్షల శ్రేణికి చేరుకుందని గుర్తుచేశారు. ఈ యేడాది ప్రారంభంలో బంగారం ధర ఒకానొక దశలో రూ. 1.81 లక్షల నుంచి రూ. 1.85 లక్షల గరిష్ట స్థాయిలను తాకిందని, దాంతో పోలిస్తే ప్రస్తుత ధరలు కొనుగోలుదారులకు కొంత ఊరట నిస్తూ, ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలికంగా బంగారం ప్రదర్శిస్తున్న పనితీరును ప్రస్తావిస్తూ, గత 26యేళ్లలో పసిడి ఏకంగా 3,200 శాతం రాబడిని నమోదు చేసిందని రోక్డేవివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని ఆర్థికసంక్షోభాలు, యుద్ధాలు,మార్కెట్ ఒడిదుడుకులుఎదురైనా బంగారం తనస్థిరత్వాన్ని కాపాడుకుంటూనేఉందని చెప్పారు. గత 26యేళ్ల చరిత్రను పరిశీలిస్తే బంగారం 3200శాతం రాబడిని అందించింది. మరే ఇతర ఆస్తి లేదా పెట్టుబడిసాధనం ఇంత నిలకడైన రాబడినిఇవ్వలేదు. ప్రతీ ఆర్థిక మాంద్యాన్ని,యుద్ధాన్ని, మార్కెట్ నష్టాలను తట్టుకుని బంగారం మరింత దృఢంగా నిలిచింది" అని స్పష్టం చేశారు. పసిడిపై ప్రజలకున్న ఈ అచంచల విశ్వాసమే ప్రస్తుత పండుగవేళ భారీ వ్యాపారానికి కారణమవుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

డాలర్ వర్సెస్ రూపాయి 93.68



ముంబయి, నవంబరు 9: అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ పెరిగింది. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లో 25 పైసలు లాభపడి 93.68 స్థాయికి చేరింది. అంతర్జా తీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం మెరుగుపడటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న ఆశలు రూపాయికి అండగా నిలిచాయి. గత వారం కూడా రూపాయి బలమైన ప్రదర్శన కనబరిచింది. 2026లోనే అత్యుత్తమ వారపు లాభాన్ని నమోదు చేస్తూ దాదాపు ఒక శాతం పుంజుకుంది. ఏప్రిల్ తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. శుక్రవారం ఒక్కరోజే 43 పైసలు పెరిగి డాలర్‌తో పోలిస్తే 93.98 వద్ద ముగిసింది. సోమవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి 93.90 సమీపంలో ప్రారంభమై 93.70 స్థాయిలో ట్రేడవుతోంది. రూపాయి పుంజుకోవడానికి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు సుమారు 1.5 బిలియన్ డాలర్లు రావడం, అమెరికా డాలర్ బలహీనపడటం, చమురు ధరలు తగ్గడం కూడా దోహదపడ్డాయి. మరోవైపు సోమవారం బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 98.17 డాలర్ల వద్ద ట్రేడవుతూ 0.15 శాతం తగ్గింది. ఇరాన్ అణు కార్యక్రమం, హార్మూజ్ జలసంధిపై చర్చల్లో గణనీయమైన పురోగతి సాధిస్తే మరిన్ని సైనిక దాడులు జరిగే అవకాశం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారాంతంలో సంకేతాలి వ్వడం మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. అయితే అమెరికాలో ఉద్యోగ గణాంకాలు అంచనాలను మించడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచవచ్చన్న అంచనాలు బలపడ్డాయి.

సంవత్ ట్రేడింగ్‌లో సూచీల ర్యాలీ



ముంబయి, నవంబరు 9: దీపావళి పండగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ముహూర్త్ ట్రేడింగ్‌లో భారత స్టాక్ మార్కెట్లు లాభాలతో శుభారంభం చేశాయి. హిందూ నూతన సంవత్సరం సంవత్ 2083కు స్టాక్ మార్కెట్ సూచీలు పచ్చని రంగుతో (లాభాలతో) స్వాగతం పలికాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే పెట్టుబడిదారుల కొనుగోళ్ల ఉత్సాహంతో బెంచ్ మార్క్ సూచీలు బలమైన ర్యాలీని నమోదు చేశాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 210 పాయింట్లకు పైగా పెరిగి ఊపందుకోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 25,070 కీలక స్థాయిని అధిగమించి ముందుకు సాగింది. ఈ ప్రత్యేక సెషన్‌లో మెటల్, ఫార్మా, బ్యాంకింగ్ రంగాల షేర్లకు పెట్టుబడిదారుల నుంచి తీవ్ర డిమాండ్ లభించింది. ముఖ్యంగా టాటా స్టీల్, సన్ ఫార్మా షేర్లలో భారీగా కొనుగోళ్ల జోరు కనిపించింది. వీటితో పాటు అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కొనుగోలుదారుల ఆసక్తితో లాభాల్లో పయనించాయి. అయితే.. మార్కెట్ లాభాల్లో సాగినప్పటికీ కొన్ని ప్రధాన కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి.

డివిడెండ్లు, స్టాక్ విభజన, బోనస్‌లు ఈవారంలోనే

ముంబయి, నవంబరు 9: దీపావళి పండుగ సంబరాలు ముగిసిన వెంటనే భారత స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు స్టాక్ ప్రత్యేక రివార్డుల పరంగా ఈ వారంలో ఏకంగా 76 కంపెనీలు తమ కార్పొరేట్ యాక్షన్ల ఎక్స్ రిఫరెన్స్/ రికార్డు తేదీలను నమోదు చేస్తే వీటిలో ఎఫ్ఎంసిజి దిగ్గజాలు హిందుస్థాన్ యూనిలీవర్, డాబర్ ఇండియా, ప్రభుత్వ ఇంధన దిగ్గజం ఓఎన్‌జిసి వంటి ఫ్రంట్ లైన్ లార్జ్ క్యాప్ స్టాక్స్‌తో పాటు పలు ప్రముఖ కంపెనీలు డివిడెండ్లు, బోనస్ షేర్లు, షేర్ల బైబ్యాక్ వంటివి అందిస్తున్నాయి. హిందుస్థాన్ యూనిలీవర్ మధ్యంతర డివిడెండ్ షేరుకు రూ.19 చొప్పున అందిస్తోంది. దీని రికార్డ్ తేదీని ఈనెల12గా నిర్ణయించింది. ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ మధ్యతర డివిడెండ్ రూ.8 అందిస్తోంది. రికార్డ్ తేదీ 12 గానే నిర్దేశించింది. డాబర్ ఇండియా ఒక్కో షేరుకు రూ.3.50 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇస్తూ ఈనెల 9 రికార్డ్ తేదీగా నిర్ణయించింది. అరబిందో ఫార్మా మధ్యంతర డివిడెండ్ ఒక్కో షేరుకు రూ.7 చొప్పున ఇస్తుండగా రికార్డ్ తేదీ నవంబర్ 11గా ఉంది. బేయర్ క్రాప్ సైన్స్ ఇంటీరిమ్ డివిడెండ్ ఏకంగా షేరుకు రూ.90 చొప్పున ఇస్తోంది. రికార్డ్ తేదీ నవంబర్ 12గా నిర్ణయించారు. ధాత్రి ప్రొటీన్స్ లిమిటెడ్ 1:1 రేషియోలో బోనస్ షేర్లు ఇస్తోంది. రికార్డ్ తేదీ ఈనెల13, 2026గా నిర్ణయించారు. జ్యోతి ల్యాబ్స్ , ఎఫ్‌డిసి షేర్ల బైబ్యాక్ కోసం రికార్డ్ తేదీలను వరుసగా 11, 13తేదీలుగా నిర్ణయించాయి. వీటితో పాటు కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హెచ్‌యూడీసీఓ, ఎన్‌బిబిసి, అరబిందో ఫార్మా, బాలక్రిష్ణ ఇండస్ట్రీస్,



బాలరాంపుర్ చిని మిల్స్, చాంబల్ ఫెర్టిలైజర్స్ కెమికల్స్, డాక్టర్ లాల్ పాథ్‌లాబ్స్ మధ్యంతర డివిడెండ్ ఇస్తున్నాయి. అలాగే జేఎం ఫైనాన్షియల్, నవనీత్ ఎడ్యుకేషన్, ఎన్ఆర్‌బీ బేరింగ్స్, పిడిఎస్, ప్రీమియర్‌ఎనర్జీస్, ఎస్ఎన్ఎల్ బేరింగ్స్, సొనాటా సాఫ్ట్‌వేర్, జొడియాక్ జెఆర్‌డి ఎంకెజె వంటివి సైతం ఉన్నాయి. వీటి రికార్డ్ తేదీ నవంబరు 11గా నిర్ణయించారు. బేయర్ కార్పో సైన్స్, గాడ్ ప్రే ఫిలిప్స్ ఇండియా, ఇండియా మెటల్స్, ఫెర్రో అలేస్, ఇసెక్టిసైడ్స్ ఇండియా, సఫారా ఇండస్ట్రీస్ ఇండియా, గుజరాత్ పిపావావ్ పోర్ట్, ఎన్ఎల్సీ ఇండియా, జిపిటి హెల్త్ కేర్, గాజా ఆల్టర్నేటివి అసెట్ మేనేజ్మెంట్, ఐఆర్‌బి ఇన్‌ఫ్రా వంటివి ఇంటెరిమ్ డివిడెండ్ ఇస్తున్నాయి.

వీటి రికార్డ్ తేదీ నవంబరు 12గా ఉంటే 13వ తేదీన ఎక్స్ డివిడెండ్ రికార్డ్ తేదీ ఉన్న కంపెనీల్లో కంప్యూటర్ ఏస్ మేనేజ్మెంట్ సర్వీసెస్, ఎమామీ, గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ, ట్రాన్స్‌వరల్డ్ షిప్పింగ్ లైన్స్, ప్రెమ్మో గ్లోబల్, సొమానీ సెరామిక్స్, పెరల్స్ గ్లోబల్ ఇ